J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12





THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 9 05.8.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ధన్యజీవి... మన వెంకయ్య

## ఉప రాష్ట్రపతిగా ఆగస్టు 10న పదవీ విరమణ చేయనున్న తెలుగు జాతి ముద్దుబిడ్డ



ఆయన కంఠం నుండి జాలువారే తెలుగు నెల్లూరు యాస. ఆయన ఏ పదవిలో ఉన్నా తెలుగు భాషపైనా, నెల్లూరు యాసపైనే ఆయన ధ్యాస. నిత్యం ఆయన ప్రయోగించేది అంత్యప్రాస. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సిద్ధాంతాలు, భారతీయ జనతా పార్టీ భావాలు ఆయన శ్వాస. తనకు ఊహ తెలిసేనాటికే అమ్మను కోల్పోయారు. యవ్వన ప్రాయం నుండి సంఘ్‌ని, పార్టీనే నమ్ముకున్నారు. తన విజయానికి తానే రాచబాట వేసుకున్నారు. అంచెలంచెలుగా ఎదిగి సామాన్య కార్యకర్త స్థాయి నుండి సమున్నతమైన భారత ఉపరాష్ట్రపతి స్థానానికి ఎదిగారు.

నెల్లూరు ఖ్యాతిని, తెలుగువాడి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మాటల మేటి, రాజకీయ ఘనాపాటి, ఆయనకి ఆయనే సాటి... మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణం తరువాత 2017, ఆగస్టు 10వ తేదీ భారతదేశ 13వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు మన వెంకయ్య. ఈ అయిదేళ్ల కాలంలో, తన పదవితో పాటు మన దేశానికి కూడా వన్నెతెచ్చారు. ఖండాంతరాలు దాటి పర్యటించినా తన పంచెకట్టును మాత్రం వీడలేదు. భారతీయ సంస్కృతికి, సంప్రదాయలకు, కట్టుబాట్లకు ప్రాచుర్యం కల్పించారు. ఈ ఆగస్టు 10, 2022న భారత ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయనున్నారు.

అనితరసాధ్యం, అనన్యసామాన్యమైన ఆయన జీవిత ప్రస్థానాన్ని ఒకసారి పరిశీలిస్తే... (3,12 పేజీలలో)

## అతి సామాన్య స్థాయి నుండి..
## అనితరసాధ్యమైన స్థానానికి ఎదిగారు!



# శేషాచార్యులకు..'స్వర్ణ కంకణం' బహుకరణ



నెల్లూరుజిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్య దర్శి, ఇందుకూరుపేట లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అర్చ కుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో స్వర్ణకంకణం బహుకరించి ఘనంగా సత్కరిం చారు. భాగ్యనగర్‌లోని హరిహర కళాభవన్‌లో లలితకళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ, రుద్రాక్ష వైభవపీఠం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ కంకణ పురస్కారాల సంబరాల్లో ఆయనకు ఈ అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ ప్రభుత్వ న్యూఢిల్లీ ప్రతినిధి డా.సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని శేషాచార్యుల వారు ఆలయ విధులు, అర్చకుల శ్రేయస్సు లక్ష్యంగా చేస్తున్న కృషిని కొని యాడారు. అనంతరం నెల్లూరుజిల్లా అర్చక పరిషత్ అధ్యక్షులు పరాంకుశం అనంతపద్మ నాభప్రసాద్ ఆచార్యుల వారి సేవలకు గుర్తింపుగా కూడా స్వర్ణ కంకణం బహుకరించి 'విద్వన్మణి' బిరుదును ఆయనకు ప్రదానం చేశారు.

# పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పలువురు పద్మశాలి విద్యార్థులకు ఇటీవల నెల్లూరులోని ఓ కళ్యాణమండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కర్నూలు ఎంపి ఎస్.సంజీవకుమార్, ఎమ్మెల్సీ హనుమంతరావు చేతులమీదుగా ఈ పురస్కారాల ప్రదానం జరిగింది. పద్మశాలి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, నాయకులు చిలుకోటి వరదయ్య, జె.శ్రీనివాసులు, జిల్లా పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'మంచి మాట'లు వినాలి



మంచి మాటలు వినాలని, మంచిని ఆచరించాలని ఆత్మ కూరులోని తెలుగుభారతి సేవా సమితి నిర్వాహకులు కోరారు. ఇటీవల ఆ సంస్థ ఆధ్వర్యంలో 'మంచి మాట' కార్యక్రమం నిర్వహించారు. యువత పాశ్చాత్య మోజులో పడకుండా ఎంతో గొప్పవైన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని, తల్లితండ్రుల పట్ల, సాటి మానవుల పట్ల అభిమానం, ఆత్మీయత చూపుతూ మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. సేవాభారతి గౌరవాధ్యక్షుడు ఎస్‌వి రమణయ్య, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, సభ్యులు టి.వెంకటసుబ్బయ్యలతో పాటు రవీంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రామయ్యస్వామి, హరికృష్ణ, మల్లికార్జున, ఖాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'అమ్మభాష.. అంటే అమృతమే!



అమ్మభాష అంటే అమృతమేనని, ప్రతిఒక్కరూ మాతృభాషను శ్రద్ధాసక్తులతో నేర్చు కోవాలని, మాతృభాషలో విద్యను అభ్యసించిన వారు సమాజంలో సమున్నతస్థాయిని పొందుతారని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా నాయుడుపేటలోని పుదూరు గ్రామంలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం), ఆ పాఠశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటుతూ హృద్యంగా పద్యాలు వినిపించారు. పద్యవిద్య పట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఉపన్య సించారు. చిన్నారులందరూ దేశభక్తి, దైవభక్తి, గురుభక్తితో, తల్లితండ్రుల పట్ల భక్తితో ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని బాగా రాణించాలని ప్రముఖ కవి, 'లాయర్' పత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు సూచించారు. నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగుభాష పట్ల మక్కువ పెంచుకోవాలని, కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను ఎవరూ విస్మరించరాదన్నారు. ఈ సందర్భంగా 'దేశభక్తి' అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులకు నెరసం తరఫున సర్టిఫికెట్లు, పుస్తక బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్ తస్నీరు శశికళ, ఉపాధ్యాయులు సునీత, లక్ష్మి, గీత, దాక్షాయిని పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశనాయకుల వేషధారణలు అలరించాయి.

## శ్రీ చాముండేశ్వరిదేవి ఆలయానికి

# లక్ష విరాళం



జిల్లాలోని ప్రముఖ దేవ స్థానమైన ఇందుకూరు పేట మండలం గంగ పట్నం గ్రామంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో నిత్యాన్న ప్రసాద వితరణకు ఆ గ్రామానికి చెందిన జి.కోటేశ్వరరావు, పద్మావతమ్మ కుమా రుడు గొడ్డేటి ప్రభాకర్-కల్పన దంపతులు ఇటీవల లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

## మనుబోలమ్మకు

# ప్రత్యేక పూజలు

మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ అమ్మవారికి ఇటీవల గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజలు చేసి చలివిడి, పానకాలు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. మను బోలమ్మ, నాగారపమ్మ, గంగమ్మ దేవత లకు అభిషేకాలు చేశారు. అర్చకుడు సర్వేపల్లి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మ వార్లకు ఈ విశేష పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పొం గళ్ళు పొంగించి అమ్మవార్లకు మొక్కు బడులు తీర్చుకున్నారు.

## పెంచలకోనలో నిత్యాన్నదానానికి

# లక్షా 18వేల విరాళం



రాపూరు మండలం, పెంచలకోన లోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బసినాయుడుపల్లి గ్రామానికి చెందిన కె.కిశోర్‌కుమార్ దంపతులు ఇటీవల 1,18,500 రూపా యలను విరాళంగా అందించినట్లు ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు.

## కావలిలో కోలాహలంగా..

# జాతీయజెండాలతో ర్యాలీ

ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1న కావలి పట్టణంలో పెద్దఎత్తున అధికారులు, ప్రజలు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో కావలి మార్మోగింది. కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద నుంచి పలు వీధుల్లో ర్యాలీ కోలాహలంగా కొనసా గింది. ఆర్డీఓ శీనానాయక్, మునిసిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతి నిధులు దాకారపు రవిప్రకాష్, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్ నాయుడు, సామాజిక సేవా కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, సచివాలయ కార్య దర్శులు, సిబ్బంది, పలు శాఖల అధికా రులు పాల్గొన్నారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు.

# ఎట్టకేలకు గోవిందంపల్లికి బస్సు

## విపిఆర్, విక్రమ్‌ల సహకారానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిల సహకారంతో ఎట్టకేలకు అనంతసాగరం మండలంలోని గోవిందంపల్లికి ఆర్టీసి బస్సు నడపడంతో పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ముస్తాపురం, పాతాళపల్లి, గోవిందంపల్లి తదితర గ్రామాల ప్రజలు ఎన్నో అవస్థలు పడేవారు. ముఖ్యంగా విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్ళాలంటే ఎంతో అగచాట్లు పడేవారు. నాయకుల చొరవతో ఆగస్టు 1న ఆత్మకూరు డిపో నుంచి పాతాళపల్లికి బస్సు రావడంతో ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. బస్సు ఏర్పాటుకు సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతసాగర మండలం పాతాళపల్లి గ్రామ సర్పంచ్ బిజివేముల ఓబులురెడ్డి, ప్రజలు బస్సుకు స్వాగతం పలికారు. స్థానిక వైకాపా నాయకులు రాపూరు వెంకట సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కోవూరులో.. 'హర్ ఘర్ తిరంగా'

ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1న కోవూరులోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణం నుంచి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించి కోవూరు వీధుల్లో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఓ శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పొదుపు మహిళలు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ నినాదాలు చేశారు. గ్రామ సర్పంచ్ విజయమ్మ, ఎంఇఓ రహీం, పంచాయతిరాజ్ ఏఇ పరమేశ్వర్, ఇఓపిఆర్డీ కల్పన, హౌసింగ్ ఏఇ అశోక్‌కుమార్, వెలుగు ఏపిఎం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్!..

## ○ నెల్లూరులో మళ్ళీ గొలుసుదొంగలు

## ○ మహిళ మెడలో బంగారుదండ తెంపుకుపోయారు

ఇటీవల కొద్దికాలంగా సద్దుమణిగిన గొలుసుదొంగలు ఇప్పుడు మళ్ళీ పెట్రేగి పోతున్నారు. ఎక్కడినుంచో సర్రుమంటూ మోటార్‌బైక్‌పై వచ్చి నడిచివెళ్తున్న మహిళల మెడల్లో ఉన్న బంగారుదండలు తెంపుకుపోతున్నారు. దీంతో నెల్లూరు నగరంలో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల నగరంలోని పొదల కూరురోడ్డులో మిట్టమధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో మేరీ అనే మహిళ ఇంటికి దగ్గరలోనే ఉన్న అంగడికి వెళ్ళి సరుకులు కొనుక్కుని వస్తుంటే ఇద్దరు దుండగులు బైక్‌పై వెంబడించి ఆమె మెడలో ఉన్న సుమారు లక్ష రూపాయల విలువచేసే బంగారు గొలుసును బలవంతంగా లాక్కుపోయారు. దీంతో ఆమెకు స్వల్పగాయాలు కూడా తగిలాయి. హతాశురాలైన ఆమె తేరుకుని కుటుంబసభ్యులతో కలసి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ మహబూబ్ సుబానీ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి గొలుసుదొంగల కోసం గాలిస్తున్నారు.

# తలుపులు పగులగొట్టి..చోరీ

## ➢ ఇళ్లకు తాళం వేస్తే ఇంతే సంగతులు

ఇంటికి తాళం వేస్తే చాలు..దొంగలు కనిపెట్టి దోచుకుపోతున్నారు. గత కొద్దికాలంగా నెల్లూరుజిల్లాలో ఈ తరహా దొంగతనాలు పెచ్చుమీరిపోయాయి. ఎవరు ఇంటికి తాళం వేస్తారా..అని కనిపెట్టి మరీ ఈ చోరీలు చేస్తున్నట్లుంది. ఇటీవల ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో పి.రామకృష్ణారెడ్డి తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళాడు. మళ్ళీ ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంకేముంది..దొంగలు అందినకాడికి అంతా దోచుకుపోయారు. ఇంటి తలుపులను పగులగొట్టి, బీరువాలో ఉన్న నగలను మూటగట్టుకుపోయారు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో దొంగల ఆచూకీ కనిపెట్టేందుకు ఉలవపాడు పోలీసులు రంగంలోకి దిగారు.

# కొమ్మి హైస్కూల్‌లో.. ఉత్సాహంగా అమృతోత్సవాలు

కొండాపురం మండలంలోని కొమ్మి గ్రామంలోని హైస్కూల్‌లో ఆగస్టు 1న ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను వేడుకగా జరిపారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ఈనెల 1 నుంచి 15వ తేది వరకు దేశభక్తి కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేసేందుకు సమాయత్తమవుతున్నామని పాఠశాల హెడ్మాస్టర్ విద్యుల్లత, కొమ్మి మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ కెవి అరుణ, దొరసాని, దాక్షాయణి, ఆదిలక్ష్మి తదితరులు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మరింత స్ఫూర్తిదాయకంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో రెండు జిల్లాలు ఎంపిక కాగా, అందులో ఒకటి నెల్లూరుజిల్లా కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్వాతంత్ర్యవీరులను స్మరించుకుంటూ దేశభక్తిని ప్రబోధించేందుకు చిన్నారులకు వ్యాసరచన పోటీలు, క్విజ్‌లు, కళాత్మక రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల్లోని అనేకమంది ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ధన్యజీవి... మన వెంకయ్య

**భారత ప్రధానిగా దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను మలుపు తిప్పిన శ్రీ పి.వి. నరసింహారావు తర్వాత దేశ ప్రజల హృదయాల్లో హత్తుకుపోయిన జాతీయ స్థాయి తెలుగు నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఆయనే ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు అని చెప్పక తప్పదు.**

*తన ఆహార్యం, మాటతీరు, పంచెకట్టు ద్వారా తెలుగుదనం మూర్తీభవించిన వ్యక్తి, తెలుగుజాతి గర్వించదగ్గ నేత శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు. ఆయన దేశంలోని మిగతా ప్రాంతాల ప్రజలకు కూడా మేరునగధీరుడైన జాతీయ నాయకుడు కూడా. ఇవాళ అన్ని ప్రాంతాల ప్రజలకు ఆమోదయోగ్యమైన, సుపరిచితుడైన, అందరి గౌరవాన్ని అందుకున్న జాతీయ నాయకుడెవరని అభిప్రాయ సేకరణ చేస్తే... అగ్రశ్రేణిలో ఉండే నేత వెంకయ్య నాయుడు. ఎందుకంటే అయిదు దశాబ్దాలకు పైగా దేశ రాజకీయాల్లో ఉన్న వెంకయ్య వ్యక్తిత్వం గురించి ఎవరికీ పరిచయం చేయనవసరం లేదు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏ హోదా చేపట్టినా, ఆ పదవికి వన్నె తెచ్చిన నేత ఆయన. దేశంలో ఏ మూలన సంక్షోభం వచ్చినా దానిపై స్పందించి, తనదైన శైలిలో పరిష్కరించేందుకు ప్రయత్నించే నేత వెంకయ్యనాయుడు.*

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా చవట(చౌడు)పాలెంలో ఒక వ్యవసాయ కుటుంబంలో రంగయ్యనాయుడు, రమణమ్మ దంపతులకు 1949 జూలై 1న జన్మించిన ఆయన... యుక్తవయస్సులో ఉండగా బిజెపి జాతీయ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ అద్వాణీల పోస్టర్లను నెల్లూరు గోడలపై అంటించేవారని ఎంతమందికి తెలుసు? బాల్యంలోనే తల్లిని కోల్పోయి, తండ్రి వైరాగ్యంతో ఎక్కడికో వెళ్లిపోయినప్పుడు దుఃఖాన్ని దిగమ్రింగుకుని అమ్మమ్మ ఒడిలోనే మమకారాన్ని చవిచూడాల్సిన అనుభవం ఆయనకున్నదని ఎంతమందికి తెలుసు?ఇలాంటి పరిస్థితుల్లో కూడా వెంకయ్య ప్రతిభావంతుడైన విద్యార్థిగా గుర్తింపు పొందారు. ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత వెంకయ్య నెల్లూరులోని వి.ఆర్. కళాశాల నుంచి రాజనీతి శాస్త్రంలో బిఏ పట్టా పొందారు. ఆ తర్వాత విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బిఎల్ పూర్తిచేసి లా పట్టా అందుకున్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. చిన్ననాటి నుంచే ఆర్.ఎస్.ఎస్ స్వయంసేవక్‌గా పనిచేయడం వల్ల క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితం ఆయనకు అలవడింది. సోంపల్లి సోమయ్య, భోగాది దుర్గాప్రసాద్ వంటి సంఘ్ పెద్దలు ఆయనలో నాయకత్వ లక్షణాలను నూరిపోశారు.

## విద్యార్థి దశలోనే నాయకత్వ ప్రతిభ

వెంకయ్య నాయకత్వ ప్రతిభ ఆయన విద్యార్థి దశలోనే బహిర్గతమైంది. వి.ఆర్. కాలేజితో పాటు ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలకూ ఆయన విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1972లో జై ఆంధ్రా ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విజయవాడ, నెల్లూరులలో జరిగిన ఉద్యమాల్లో వెంకయ్య ఒక విద్యుత్ రేఖలా మెరిశారు. కాకాని వెంకట రత్నం లాంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. ఏ సభలోనైనా తన అనర్గళ వాక్చాతుర్యంతో ఆయన జనం దృష్టిని ఆకర్షించేవారు, ఆంధ్ర లా కాలేజీ తరపున ఏబీవీపీ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఆయనపై జాతీయనేతల దృష్టి పడింది. ఈ సందర్భాన్ని ఆయన జీవితంలో కీలక మలుపుగా పేర్కొనవచ్చు.

1970వ దశకంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాయడం, వ్యవస్థలు సంక్షోభంలో పడడంతో వెంకయ్యనాయుడులో వ్యక్తమైన ఆగ్రహమే ఆయనను రాజకీయాల దిశగా నడిపించింది. బీహార్‌లో అవినీతికి వ్యతిరేకంగా ప్రచారానికి సారథ్యం వహిస్తున్న జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వం దిశగా ఆకర్షితులయ్యారు. కొద్దిరోజుల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో జయప్రకాశ్ నారాయణ్ నిర్వహించిన ఉద్యమాన్ని పర్యవేక్షించేందుకు ఏర్పర్చిన సంఘర్ష్ సమితికి ఆయన సారథ్యం వహించారు. జెపి ఉద్యమంలో ఆయన ముందుండి సాగించిన పోరాటం కారణంగా కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో, ఇందిరాగాంధీ ప్రభుత్వంలో ఇతర ఏజన్సీల దృష్టి ఆయనపై మళ్లింది. దుర్మార్గమైన ఎమర్జెన్సీ రోజుల్లో ఆయనను ఇందిరాగాంధీ నియంతృత్వ ప్రభుత్వం ఇతర ప్రతిపక్ష నేతలతో పాటు దాదాపు 17నెలల పాటు జైలులో బంధించింది. హైదరాబాద్, విశాఖపట్టణం, నెల్లూరు... ఇలా మూడు జైళ్లలో ఆయన శిక్షను అనుభవించారు.

అప్పటికే జాతీయ స్థాయిలో జనసంఘ్ దృష్టి ఉడుకు రక్తం ఉరకలు వేస్తున్న వెంకయ్యపై పడడంతో కేవలం 28 ఏళ్ళ వయసున్న ఆయనకు, శాసనసభ నుంచి పోటీ చేసేందుకు ఆహ్వానం లభించింది. నెల్లూరుజిల్లాలో ఏకైక ప్రతిపక్ష గొంతుక వినిపించిన వెంకయ్య ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 1978లో ఆయన జనతా పార్టీ టిక్కెట్‌పై ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు నెల్లూరు జిల్లాలో మిగతా పది నియోజకవర్గాల నుంచి ఎన్నికైన వారంతా కాంగ్రెస్ అభ్యర్థులే. అప్పట్లో దేశమంతా ఇందిరాగాంధీ ప్రభంజనం వీస్తున్నా ఉదయగిరిలో మాత్రం వెంకయ్యదే విజయబావుటా. స్వయంగా ఇందిరాగాంధీ ఉదయగిరికి ప్రచారానికి వచ్చినప్పటికీ వెంకయ్యను ఓడించలేకపోయారు. ఈవిధంగా ఆయన తొలిసారిగా ఏపీ అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1980 నుంచి 85 వరకూ బీజేపీ అఖిలభారత యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా సేవలందించారు.

1983లో ఆయన బిజెపి టికెట్‌పై గెలిచినప్పుడు జిల్లాలో మిగతా 10 నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. రాష్ట్రమంతా తెలుగుదేశం ప్రభంజనం వీచినా, స్వయంగా ఎన్టీరామారావు ఉదయగిరి వచ్చి తెలుగుదేశం అభ్యర్థికోసం ప్రచారం చేసినప్పటికీ, గెలుపు మాత్రం వెంకయ్యనే వరించింది. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి తిరుగులేని నాయకుడుగా మారారు.

1983లో తెలుగుదేశం పార్టీ స్థాపించి భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావును గద్దె దించేందుకు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1984లో తనకు విధేయుడైన గవర్నర్ రాంలాల్‌ను ఉపయోగించుకున్నారు. అప్పుడు ఎన్టీఆర్ మద్దతుదారులైన ఎమ్మెల్యేలందర్నీ సురక్షితంగా తరలించి హైదరాబాద్ రామకృష్ణ స్టూడియోలో మకాం పెట్టిన అనంతరం, వారందరినీ న్యూఢిల్లీకి తీసుకు వచ్చి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముందు చారిత్రక పరేడ్ నిర్వహించడంలో వెంకయ్యనాయుడు కీలక పాత్ర పోషించారు. చివరకు గవర్నర్



రాంలాల్ తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎన్టీఆర్‌ను అప్రజాస్వామిక మార్గంలో పదవీచ్యుతుడిని చేసేందుకు ఇందిరాగాంధీ చేసిన ప్రయత్నాలను వెంకయ్యనాయుడు ఇతర ప్రతిపక్ష నాయకులతో కలిసి తన ధీశక్తితో వమ్ము చేశారు.

## బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా, అధ్యక్షునిగా సేవలు...

1985 నుంచి 1988 వరకు ఏపీ బిజెపి ప్రధాన కార్యదర్శిగా 1988 నుంచి 1993 వరకు ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. బిజెపి నిర్వహించిన అనేక జాతీయ సదస్సుల్లో వెంకయ్య హిందీ, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా ప్రసంగించడంతో ఆయన జాతీయ స్థాయిలో ఉండాల్సిన వ్యక్తి అని వాజపేయి, అద్వానీ భావించారు. 1993లో ఆయనను జాతీయ స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 1998లో రాజ్యసభకు ఎంపిక చేశారు. 1996 నుంచి 2000 వరకూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. అటు అధికార ప్రతినిధిగా, ఇటు రాజ్యసభలో బిజెపి తరఫున మంచి వక్తగా వెంకయ్య నాయుడు రాణించడంతో జాతీయస్థాయిలో వెంకయ్య పేరు మారుమ్రోగి పోయింది. ఆయన వాగ్ధాటికి అటు విలేకరులు, ఇటు పార్లమెంట్ సభ్యులు అచ్చెరువొందేవారు. ఎన్నికల సభల్లోనూ ఆయన అనర్గళ ప్రసంగాలకు జనం ఉర్రూతలూగేవారు.

వెంకయ్య ఒక్క వాక్యంలో రసస్ఫూర్తిని సాధించడంలో దిట్ట. అనుప్రాసలు చేయడం ఆయనకెంతో ఇష్టం. ఒక విషయాన్ని మనస్సుకు హత్తుకునేలా చెప్పడానికి ఆయన ప్రాస వేస్తే తరుచూ విలేకరులు నవ్వుల్లో తేలిపోయేవారు. సహజసిద్ధంగా రంధ్రాన్వేషణ చేసే స్వభావం ఉన్న విలేకరులు ఆయన మాటల తూటాల వెనుక ఉన్న భావాలపై తర్జన భర్జనలు సాగిస్తారు. అది వారి పనే. కాని వారు ఏ అర్థం లాగినా చివరకు వెంకయ్య తన మాటల తూణీరాల్లోంచి వదిలిన అక్షర బాణాలు ప్రింట్, టెలివిజన్ స్క్రీన్‌లను ఆకర్షించేవి. కరణ్ థాపర్, రజత్ శర్మ లాంటి ప్రశ్నల వర్షం కురిపించే జర్నలిస్టులు కూడా వెంకయ్య ధాటికి తలవంచేవారు, తెలుగే కాకుండా. ఇంగ్లీష్, హిందీ భాషలపై వెంకయ్య నాయుడుకు మంచి పట్టు ఉండటం, విషయ పరిజ్ఞానం,అనర్గళ వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి లాంటి లక్షణాలు ఆయనంటే అందరూ ఇష్టపడేలా చేశాయి.

## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా...

1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అటల్ బిహారీ వాజపేయి సారథ్యంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది.వెంకయ్యనాయుడు 2000 సెప్టెంబర్ నుంచి 2002 జూన్ వరకు వాజ్‌పేయి హయాంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలందించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయన సమకాలీనులు అందరూ ప్రభుత్వంలో చేరితే, వెంకయ్య మాత్రం పార్టీలో ఉంటానని, కేంద్ర కార్యాలయం ద్వారా పార్టీ పని చేసేందుకు ముందుకు రావడం నాయకులందరినీ ఆకర్షించింది. అయినప్పటికీ ఆయన పనితీరును దృష్టిలో ఉంచుకుని మంత్రి పదవి ఇవ్వాలని కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. శాఖ ఎంపిక అవకాశాన్ని సైతం ఆయనకే ఇచ్చింది. అత్యంత కీలకమైన ఆర్థిక ప్రాధాన్యత ఉన్న మంత్రిత్వ శాఖలు కోరుకుంటారనుకుంటే వెంకయ్య గ్రామీణాభివృద్ధి శాఖను కోరి వాజపేయిని సైతం ఆశ్చర్యపరిచారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన అనే కీలక పథకాన్ని ప్రారంభించి దేశంలోని వేలాది గ్రామాలకు రహదారులు లభించేలా చూశారు, దేశంలోని ముఖ్యమంత్రులందరూ ఆయన కార్యాలయానికి వచ్చి తమకు కావల్సిన పథకాలను మంజూరు చేయించుకుని వెళ్లేవారు. నిజానికి తనను పార్టీ ప్రధాన కార్యదర్శి (మహా మంత్రి) పదవి నుంచి మంత్రి పదవికి పంపించడం తన హోదా తగ్గించడమే అని ఆయన వాజపేయి వద్ద చమత్కరించారు, ప్రభుత్వ పదవుల కన్నా పార్టీ పదవికి తాను ప్రాధాన్యత నిస్తానని ఆయన ఆ రకంగా సంకేతాలు ఇచ్చారు, ఆయన వాక్కులో ఎంత బలమున్నదో, జాతీయ నాయకత్వం ఆయన మాటకిచ్చే ప్రాధాన్యత ఎలాంటిదో రెండేళ్లలోనే అందరికీ తెలిసి వచ్చింది. పార్టీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో వాజ్‌పేయి, అద్వానీ ఆయనకు పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. 2002 జూలైలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికై 2004 చివరి వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆ సమయంలో పార్టీని బలోపేతం చేసే ఎన్నో చర్యలు తీసుకున్నారు, ఒక చేతిలో ఎన్డీఏ ఎజెండా, మరో చేతిలో బిజెపి జెండా అన్న నినాదం ఆయన సృష్టించిందే, కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వర్తించే మంత్రులను సైతం ఆయన పార్టీ కార్యాలయానికి రప్పించి పార్టీ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు వీలు కల్పించారు, ప్రధానమంత్రి కార్యాలయానికీ, పార్టీకి మధ్య కీలక సంధానకర్తగా పనిచేశారు.

ఒకప్పుడు వాజ్‌పేయి, అద్వానీల పోస్టర్లు అంటించి, వారి సభల కోసం ప్రచారం చేసిన కార్యకర్త అయిన వెంకయ్య జాతీయ స్థాయిలో వారి మధ్య కూర్చుని వారిద్దరి తర్వాత అత్యంత ప్రాధాన్యత గల నేత తానేనని నిరూపించారు. ఆ తర్వాత 2004, 2010లోనూ వెంకయ్య నాయుడు వరసగా రాజ్యసభ ఎంపీ అయ్యారు. యుపిఏ హయాంలో భారతీయ జనతా పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి ఆయన రాజ్యసభ వేదికగా ప్రభుత్వాన్ని చీల్చిచెండాడడం కారణం.

## రాష్ట్రానికి న్యాయం కోసం అలుపెరుగని పోరాటం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగినప్పుడు కొత్తగా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం కావాలంటూ ఆయన చేసిన మడమతిప్పని పోరాటానికి చరిత్ర ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. విభజన తర్వాత ఆయన పరిపక్వ వైఖరినీ, వివేకాన్నీ ప్రదర్శించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలమధ్య సామరస్య సంబంధాలకు అడ్డంగా నిలిచే సమస్యాత్మకమైన అనేక అంశాలను పరిష్కరించేలా చూశారు. వివాదాస్పద అంశాలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాలకు న్యాయం చేసేందుకు ఆయన కేంద్ర

12లో

లాయర్
ఆగస్టు 05, 2022

# పీడ.. విరగడైంది

**కరడుగట్టిన ఉగ్రవాది, అమెరికాను వణికించిన 9/11 ఉగ్రదాడుల సూత్రధారి, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా చీఫ్ అయ్‌మాన్ అల్ జవహరీ (71) ఎట్టకేలకు అమెరికా చేతిలో హతమవడం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు సంతోషం కలిగించింది. తాలిబన్ల పాలనలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో తలదాచుకుంటున్న జవహరీ కదలికలను పసిగట్టిన అమెరికా నిఘా వ్యవస్థ సిఐఏ విజయవంతంగా డ్రోన్‌లతో రహస్య ఆపరేషన్ ద్వారా అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించి ఆ భయంకరమైన ఉగ్రవాదిని తుదముట్టించడంతో ప్రపంచ ఉగ్రవాద దుష్టచరిత్రలో మరో అధ్యాయం ముగిసినట్లయింది.**

కరడుగట్టిన ఉగ్రవాది, అమెరికాను వణికించిన 9/11 ఉగ్రదాడుల సూత్రధారి, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా చీఫ్ అయ్‌మాన్ అల్ జవహరీ (71) ఎట్టకేలకు అమెరికా చేతిలో హతమవడం ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు సంతోషం కలిగించింది. తాలిబన్ల పాలనలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో తలదాచుకుంటున్న జవహరీ కదలికలను పసిగట్టిన అమెరికా నిఘా వ్యవస్థ సిఐఏ విజయవంతంగా డ్రోన్‌లతో రహస్య ఆపరేషన్ ద్వారా అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించి జవహరీని తుదముట్టించడంతో ప్రపంచ ఉగ్రవాద దుష్టచరిత్రలో మరో అధ్యాయం ముగిసినట్లయింది. ఆ ఉగ్రవాది ఎక్కడ ఉన్నాడో కనిపెట్టి, కాబూల్‌లోని షేర్పూర్ ప్రాంతంలో అత్యంత పటిష్టమైన భద్రత కలిగిన భవనంలో ఉన్న జవహరీని గుర్తించి, ఆకాశంలో సుమారు 50వేల అడుగుల ఎత్తు నుంచి డ్రోన్ ప్రయోగించి అత్యంతాధునికమైన ఆర్9 ఎక్స్ నింజా హెల్‌ఫైర్ క్షిపణులతో జవహరీని అంతమొందించడం, ఎలాంటి శబ్దం కూడా రాకుండా, ఈ దాడిలో ఇంకెవరికీ ప్రమాదం లేకుండా అమెరికా నిఘాసంస్థ ఎంతో ఖచ్చితత్వంతో శత్రువుని నిర్జించడం ప్రపంచ ప్రజల ప్రశంసలందుకుంది.

జవహరీ..భయంకరమైన ఉగ్రవాది. ప్రపంచంలోని భద్రతా సంస్థలు గాలిస్తున్న 'మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు'ల్లో అత్యంత ముఖ్యుడు. అల్‌ఖైదా ఉగ్రవాది బిన్‌లాడెన్‌కి అత్యంత విశ్వాసపాత్రునిగా ఉండే జవహరీ పన్నాగాలు పన్నడంలో దిట్ట. 21 ఏళ్ళ కిందట, 2001 సెప్టెంబరు 11న అమెరికాలోని న్యూయార్క్‌లో ప్రపంచ వాణిజ్యసంస్థగా ప్రఖ్యాతిగాంచిన ట్విన్ టవర్స్‌ను కూల్చివేసి 2977 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్న రాక్షసుడు. ఆ భయానక ఉగ్రదాడులతో ప్రపంచమే భీతిల్లింది. ఆ ఉగ్రదాడికి సూత్రధారి అయిన బిన్‌లాడెన్‌కు సహకరిస్తూ వ్యూహాలను పన్నింది, దశాబ్దాల తరబడి అమెరికన్లపై దాడులు చేసి మారణహోమాలు సృష్టించడం వెనుక కీలకపాత్రధారిగా వ్యవహరించింది కూడా జవహరీయేనని అమెరికా ఎప్పుడో నిర్ధారించింది. అప్పటి నుంచి అమెరికా జవహరీని మట్టుబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. అతని ఆచూకీ కోసం అమెరికా 2.5 కోట్లు (దాదాపు 200 కోట్లు) ప్రకటించింది కూడా.

అయితే ఆ ఉగ్రవాది ఎప్పటికప్పుడు దొరికినట్లే దొరికి తప్పించుకు పోయేవాడు. ఈసారి మాత్రం జవహరీకి సంబంధించిన ఖచ్చితమైన సమాచారంతో అమెరికా నిఘాదళం రంగంలోకి దిగింది. ఎవరి ఊహకు కూడా అందనంత రీతిలో అత్యంత చాకచక్యంగా డ్రోన్ ఆపరేషన్ చేయడం, జవహరీ భార్య కుమార్తెలతో పాటు మరెవరికీ ప్రమాదం లేకుండా, అత్యంత శక్తివంతమైన రెండు హెల్‌ఫైర్ మిసైళ్ళతో జవహరీని అంతమొందించడం విశేషం. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ 'జవహరీ ఇక ఎంతమాత్రమూ ఆఫ్ఘనిస్తాన్‌ను ఉగ్రవాదులకు స్వర్గధామంగా మార్చలేడు. ఎందుకంటే ఆ ఉగ్రవాదిని మట్టుపెట్టాం. అమెరికాకు, అమెరికా ప్రజలకు, తమ మిత్రపక్షాలకు ఎవరు ముప్పు తలపెట్టినా మా స్పందన ఇలాగే ఉంటుంది. 21 ఏళ్ళ క్రితం జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల ఆవేదనకు జవహరీ మరణం ఒక ముగింపుగా భావిస్తున్నాం'.. అని అన్నారు. 'యుద్ధం చేయకుండానే ఉగ్రవాదాన్ని అంతం చేయవచ్చనేది జవహరీ ఉదంతం రుజువు చేస్తోందని' అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. జవహరీని మట్టుపెట్టడం మనదేశానికి కూడా స్వల్పంగా ఉపశమనం కలిగించే అంశమే. ఎందుకంటే కశ్మీర్ విషయంలో జోక్యం జేసుకుంటూ భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం, ఆత్మాహుతి దాడులకు పాల్పడతామంటూ బెదిరించడం తెలిసిందే. ఏదేమైనా మానవబాంబుగా తయారైన ఓ ఉగ్రవాదోన్మాదిని అంతం చేయడం ద్వారా అమెరికా అందరి అభినందనలు అందుకుంటోంది. అయితే, ఆ ఉగ్రవాది మరణించినా అల్‌ఖైదా కనుమరుగవుతుందని అనుకోలేం. ఆ ఉగ్రవాద సంస్థ నుంచి ఉగ్రవాద విధానాలను పాటించేవారు పాక్ వంటి దేశాల్లో అనేకమంది ఉన్నారు. ఏ ఒక్క ఉగ్రవాదో మరణించినంత మాత్రాన ఉగ్రవాదం సమసిపోయినట్లు కాదు. దారుణ మారణహోమాలతో ప్రపంచాన్ని హడలెత్తిస్తూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఉగ్రవాదోన్మాద మూకలన్నిటికీ చరమగీతం పాడితే తప్ప ఉగ్రవాదం పోదు. మన ప్రధాని మోడీ అన్నట్లుగా, ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచ దేశాలన్నీ సమిష్టిగా సమాయత్తం కావాల్సిందే !..తప్పదు!..లేకుంటే ప్రపంచానికి శాంతి కలుగదు.

# చదువుతోనే ఉన్నత స్థానం

**--- శాలివాహన సంఘం నాయకుడు ---**



చదువుతోనే సమాజంలో ఉన్నతస్థానం లభిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతశిఖరాలను అందుకోవాలని జిల్లా శాలివాహన సంఘం నాయకులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు రూరల్‌లోని అంబాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు శ్రీనివాసబాబు, శ్రీనివాసులు పాల్గొని పదవ తరగతి, ఇంటర్‌మీడియట్‌లలో అత్యుత్తమ మార్కులు సాధించిన శాలివాహన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కెవెస్ నరసయ్య, నాయకులు మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, మధుసూదన్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొని.. ఉపాధ్యాయుని దుర్మరణం

జలదంకి మండలం సోమవరప్పాడులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అళహరి సురేష్‌బాబు(45) ఇటీవల రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యారు. కావలి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం సమీపంలో ఉన్న దిగువమార్గంలో ఆయన మృతదేహం కనిపించడంతో రైల్వే పోలీసులు ఈ ఘటనపై ఆరా తీసి వివరాలు వెల్లడించారు. సురేష్‌బాబు కావలిలో నివాసం ఉంటున్నారు. వేకువనే ఇంటివద్ద నుంచి వాకింగ్‌కు వెళ్తూ వచ్చేటప్పుడు కూరగాయలు తెస్తానని భార్యకి చెప్పివెళ్ళారు. అయితే, రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూరగాయలు తీసుకువస్తానని వెళ్ళి శవమై కనిపించడంతో ఆయన భార్యాబిడ్డల రోదన వర్ణనాతీతం. ఎస్ఐ అరుణకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నేతల స్వార్థానికి అధికారులు బలైపోతున్నారు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

'మాట వినకపోతే వేటే' అంటూ గత వారం 'లాయర్'లో వచ్చిన వార్త అధికారుల దయనీయ స్థితికి అద్దం పడుతోంది. రాజకీయాలను వ్యాపారంగా మార్చేసిన కొత్తతరం నాయకుల స్వార్థానికి అధికారులు బలైపోతున్నారు. నేతల చేతుల్లో కీలు బొమ్మలుగా మారి వారు తానా అంటే తందాన అనే వాళ్ళు మాత్రమే తమ స్థానాలను కాపాడుకో గలుగుతున్నారు. లౌకికం తెలియని అధికారులు ముక్కుసూటిగా పని చేసి తక్కువ వ్యవధిలో బదిలీలకు గురైపోతున్నారు. రాజకీయ వ్యవస్థకన్నా, అధికార వ్యవస్థ బలమైంది. పోటీ పరీక్షలు రాసి, పరిపూర్ణ శిక్షణ తీసుకుని, సమాజ శ్రేయస్సు కోసం నిస్వార్థంగా పనిచేస్తామని ప్రమాణం చేసి మరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో పనిచేయడానికి వస్తారు అధికారులు. తమ మేధస్సునంతా ఉపయోగించి ప్రజా హితం కోసం పనిచేయాలని కోటి కలలు కని బాధ్యతలు చేపడతారు. రాత్రీ పగలు కష్టపడి చదివిన చదువుకి సార్థకత చేకూర్చాలని సంసిద్ధులవుతారు. కానీ భ్రష్టుపట్టిపోయిన నేటి రాజకీయ ప్రపంచంలో వాళ్ళు కన్న కలలన్నీ అవిరైపోతున్నాయి. ఓనమాలు సైతం రాని రాజకీయ నాయకుల ఆగడాలకు అధికారులు బలైపోతున్నారు. తమకున్న సర్వాధికారాలను సైతం పక్కనపెట్టి అధికారపార్టీల నేతల సేవలో తరిస్తున్నారు. అలా ఆత్మాభిమానం చంపుకుని పనిచేయలేని అధికారులు బదిలీలకు బలైపోతున్నారు. ఇదే సంస్కృతి కొనసాగితే భవిష్యత్తులో నిజాయితీ కలిగిన అధికారులు కరువైపోవడం ఖాయం.

పి. లక్ష్మీనారాయణ, విశాఖపట్టణం.

# కాలగర్భంలో కాంగ్రెస్

ఇటీవల కాంగ్రెస్ నేతల ప్రవర్తన చూస్తుంటే ఆ పార్టీపైనా, అరా కొరా మిగిలిన ఆ పార్టీ నేతలపైనా జాలి కలుగుతోంది. వంద సంవత్సరాలపైగా చరిత్ర కలిగిన పార్టీ రానున్న రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుందా...? అన్న అనుమానం కలుగుతోంది. ఇటలీ రాణి పుణ్యమా అని ఆంధ్రాలో ఇప్పటికే అడ్రస్ లేకుండా పోయింది. దేశంలోని మిగతా రాష్ట్రాలన్నీ ఒక్కొక్కటిగా చేజార్చుకుంటోంది. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అన్న కొద్దిపాటి విశ్వాసం ఆ రాష్ట్ర ప్రజలలో ఉండడంతో ఆ రాష్ట్రంలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఐసీయులో ఉన్న పార్టీని ఎలాగైనా కాపాడుకోవాలని రేవంత్‌రెడ్డి కుస్తీపడుతున్నాడు. మోడీ - షా - నడ్డా త్రయం తమదైన స్టైల్లో అమ్మా కొడుకులకు చుక్కలు చూపిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌లో కొద్దో గొప్పో చరిష్మా ఉన్న నేతలు ఒక్కొక్కరుగా ఇతర పార్టీలలోకి జారుకుంటున్నారు. లేని పార్టీ అగ్ర నాయకత్వం పుణ్యమా అని రాష్ట్రాలలో పేరు, బలం ఉన్న కాంగ్రెస్ నేతలు ప్రాంతీయ పార్టీలను ఆశ్రయించడం లేదా వాళ్ళే ఒక పార్టీని ప్రారంభించడంతో కాంగ్రెస్‌కి ఈ దుస్థితి కలిగిందని ఖచ్చితంగా చెప్పొచ్చు. జరుగుతున్న పరిణామాలు గమనిస్తుంటే, రానున్న రోజులలో కాంగ్రెస్ మనుగడ కష్టమే అనిపిస్తోంది.

యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

# ట్రాఫిక్ సిగ్నల్స్ లేని ఏకైక నగరం



నెల్లూరు పట్టణం, కాదు... కాదు 'సిటీ'. ఇది చాలా విషయాలలో ఒక ప్రత్యేకత సంతరించుకున్న నగరం. సింహపురిగా ప్రసిద్ధి చెంది నెల్లూరుగా రూపాంతరం చెందిన చారిత్మక నగరం. మునిసిపాలిటీ నుండి కార్పొరేషన్‌గా ఎదిగి టౌన్ నుండి సిటీగా మారి కూడా సుమారు 18 సంవత్సరాలయ్యింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు నగర జనాభా భారీగా పెరిగింది. జనాభాకి తగ్గట్లుగా సిటీ కూడా నలుచెరగులా విస్తరించింది. దీంతోపాటుగా వాహనాల సంఖ్య కుడా

## సమస్యల తో 'రణం'

అపారంగా పెరిగింది. రిక్షాలు కనుమరుగైపోయాయి, ఆటోలు రాజ్యమేలుతున్నాయి. ద్విచక్రవాహనాలతో పోటీగా కార్లు రోడ్లపై పరుగెడుతున్నాయి. ఇక సిటీ బస్సుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. రోజులో ఒక 6గంటలు తప్ప మిగిలిన 18 గంటలు సిటీ రోడ్లన్నీ జన, వాహన సందడితో క్రిక్కిరిసిపోయి ఉంటాయి.

గతంలో అయ్యప్పగుడి నుండి పెన్నా బ్రిడ్జి వరకు ఒకే ఒక ప్రధాన రహదారి ఉండేది. గడచిన 20 సంవత్సరాల కాలంలో కొత్తగా మినీబైపాస్ ఏర్పడింది తప్ప అంతకుమించి పెరుగుతున్న నగర జనాభాకి తగ్గట్లుగా కొత్తగా రోడ్లు ఏర్పడ్డ దాఖలాలు లేవు. పాత జిఎన్‌టి రోడ్డుని తరువాతి కాలంలో కొత్తగా వచ్చిన మినీ బైపాసుని కలుపుతూ మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డు ఉపయోగంలోకి వచ్చి వాహనదారులకు కొంత ఊరట కలిగిస్తోంది. ఇంత జనాభా ఉన్న నెల్లూరు నగరంలో ఇప్పటివరకూ ట్రాఫిక్ సిగ్నల్సే లేవు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా చిన్నస్థాయి పట్టణాల నుండి మహానగరాల వరకూ సిగ్నల్స్ విధానంతోనే ట్రాఫిక్‌ని నియంత్రిస్తారు. కానీ నెల్లూరులో అలాంటి ఛాయలే కనిపించవు. గతంలో జిల్లాలో పనిచేసిన కొందరు పోలీసు ఉన్నతాధికారులు ముందుచూపుతో సిగ్నల్స్ ఏర్పాటు చేసినా తరువాతి కాలంలో వాటికి రాజకీయ గ్రహణం పట్టి శిధిలమైపోయాయి. గత ప్రభుత్వంలో జిల్లాలో పనిచేసిన ఒక ఉన్నతాధికారి సిగ్నల్స్ ఏర్పాటు పేరుతో భారీగా చందాలు దండి వాటిని ఏర్పాటు చేయకుండానే బదిలీపై వెళ్ళిపోయాడు. ఆ దండిన నిధులు ఎవరి ఖాతాలోకి వెళ్ళాయో భగవంతుడికెరుక. నెల్లూరులో ట్రాఫిక్‌కి ఒక నియమం లేదు, నిబంధనలు అంతకంటే లేవు. మోటారుసైకిళ్లు, ఆటోలు, కార్లు, బస్సులు ఎవరి ఇష్టం వారిదే.

ఇదే విషయాన్ని ఒక పోలీస్ ఉన్నతాధికారి వద్ద ప్రస్తావిస్తే... 'ప్రస్తుతం ఈ జిల్లాలో శాంతి భద్రతలకే దిక్కు లేదు. అసాంఘిక శక్తులకు భయంలేదు. రౌడీ మూకల ఆగడాలను అడ్డుకునే నాథుడే లేడు... అలాంటివాటి ముందు ట్రాఫిక్ నియంత్రణ కూడా ఒక పెద్ద సమస్యా...?' అని నిట్టూర్చాడు. బహుశా భారతదేశంలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని ఏకైక నగరంగా నెల్లూరు ఇలా కూడా చరిత్రకెక్కుతుందేమో..!

-సంచారి

# 93ఏళ్ల వృద్ధునికి అరుదైన చికిత్స

- బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారిస్తూ 'అవేక్ కరోటిడ్ ఎండార్టెరెక్టమీ'
- చెన్నై అపోలో హాస్పిటల్ వైద్యుల ఘనత



చెన్నై అపోలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు తాజాగా మరో ఘనత సాధించారు. మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయి, బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీసే పరిస్థితుల్లో ఓ 93ఏళ్ల వృద్ధుడికి అవేక్ కరోటిడ్ ఎండార్టె రెక్టమీని విజయవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలందుకున్నారు. 93ఏళ్ల వృద్ధుడికి ఈ తరహా చికిత్స అందించడం దేశంలోనే ఇది తొలిసారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అపోలో హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ వాస్కులర్ మరియు ఎండో వాస్కులర్ సర్జన్ డా.వి.బాలాజీ మాట్లాడుతూ మెదడుకు వెళ్లే రక్తనాళంలో ఏర్పడిన అడ్డంకిని క్లియర్ చేయడం ద్వారా స్ట్రోక్‌ను నివారించవచ్చని చెప్పారు. ఈ ప్రక్రియను కరోటిడ్ ఎండార్టెరెక్టమీ అంటారని తెలిపారు. ప్రస్తుతం 93ఏళ్ల వృద్ధుడికి ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఆయన ప్రాణాలను కాపాడామన్నారు. గత ఇరవై ఏళ్లలో 700 కంటే ఎక్కువగా ఈ తరహా చికిత్సలను అందించినట్లు తెలిపారు. అయితే దేశంలోనే 93 ఏళ్ల వృద్ధుడికి ఈ చికిత్స చేయడం ఇదే తొలిసారి అని తెలిపారు. ప్రతి 20 సెకన్లకు భారతదేశంలో ఒకరు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారని, ప్రస్తుత జీవన శైలికారణంగా వీరి సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతారెడ్డి అన్నారు. స్ట్రోక్‌కు గురైన వారు సకాలంలో హాస్పిటల్‌కు చేరుకోలేక ప్రాణాలు వదలాల్సి వస్తుందని, స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలను ముందుగానే గుర్తించి, వైద్యులను సంప్రదించడం వల్ల వారు ప్రాణాలను కాపాడుకున్నవారవుతారని తెలిపారు. చెన్నై అపోలో హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించి అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఇళ్ల నిర్మాణాలు

# ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలి

జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాలను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరు నగర పరిధిలోని గుండ్లపాలెంలో జగనన్న లే అవుట్‌ను, అంబాపురం జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాల పురోగతిని పరిశీలించి, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు చెప్పారు. ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం అంబాపురం జగనన్న కాలనీల్లో ఇంకా పూర్తికాని ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రోజువారీ లక్ష్యాలను నిర్ధేశించుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. హౌసింగ్ ఇఇ నాగరాజు, డిఇ శ్రీహరి గోపాల్, తహశీల్దారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో జస్టిస్ రోహిణిని కలిసి..

# బీసీల సమస్యలను విన్నవించిన బీద




రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు ఈనెల 3న భారత మాజీ న్యాయమూర్తి, మరియు ప్రస్తుతం భారతదేశంలోని వెనుకబడిన తరగతుల వర్గాల సమస్యలను పరిశీలించే ప్రభుత్వ కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా ఉన్న జస్టిస్ రోహిణిని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ, మొత్తంగా దేశంలో వెనుకబడిన వర్గాలకు సంబంధించిన పలు సమస్యలను, వారి జీవన విధానాలను ఆయన సుదీర్ఘంగా జస్టిస్ రోహిణికి వివరించారు. చట్టసభలలో ఇతర వెనుకబడిన వర్గాలకు కల్పించవలసిన రిజర్వేషన్లు, విద్యా-ఉద్యోగాలలో వెనుకబడిన తరగతుల వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ రోహిణి మాట్లాడుతూ బీదా మస్తాన్‌రావు చర్చించిన వివిధ అంశాలను, సమస్యలను పరిశీలించి, తమ నివేదికలో పొందుపరిచి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

## బీసీల ఆందోళనలో బిఎంఆర్



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 2న జరిగిన నిరసన దీక్ష కార్యక్రమంలో వైఎస్సార్సీపి ఎంపీలతో కలసి రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కులాల వారీగా జనగణన జరిపించాలని, కేంద్రంలో ప్రత్యేక బిసి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి ఒక్క వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీద మస్తాన్‌రావుతో పాటు వైఎస్సార్సీపి ఎంపీలు ఆర్ కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 'డైట్'లో పింగళి జయంతి

ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఈ నెల 2న జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, రంగస్థల నటుడు బళ్ళారి రాఘవల జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. కె.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం'

## 15వ భాగం





యయాతి మహారాజు తన చిన్న కుమారుడు పూరునికి పట్టాభిషేకం చేసి అడవులకెళ్లి తపస్సు చేసుకుంటాడు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకి పూరుని వంశ చరిత్ర చెపుతాడు. ఆ వంశంలో చెప్పుకోదగిన వాడు ఇలీలుడు. అతని భార్య రథంతరి. వారి కొడుకే దుష్యంతుడు. అతను చాలా బలపరాక్రముడు, ప్రజలని చక్కగా పరిపాలిస్తాడు.

దుష్యంతుడు ఒకరోజు అడవికి వేటకి వెళ్లి, చాలా దూరం జంతువులని వేటాడుతూ, కణ్వమహాముని ఆశ్రమానికి వస్తాడు. అక్కడ శకుంతలని చూసి ఆమె అంటే ఇష్ట పడతాడు. శకుంతల తన జన్మ వృత్తాంతం చెపుతుంది.

ఒకసారి విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేస్తుంటే, ఇంద్రుడు తన పదవికి గండం వస్తుందని మేనకని పిలిచి విశ్వామిత్రుని తపస్సు భంగం చెయ్యమని కోరతాడు. మేనక ముందు భయపడినా తర్వాత నలుగురు దేవతల సహాయంతో భూలోకం వెళ్లి తన అందచందాలతో విశ్వామిత్రుని తపస్సు భంగం చేస్తుంది. విశ్వామిత్రుడు ఆమె అందానికి ఆకర్షితుడై ఆమెతో సుఖాలు అనుభవించి ఒక ఆడపిల్లను కంటాడు. మేనక తను వచ్చిన పని అయిపోయిందని అమరలోకానికి వెళ్లిపోతుంది. విశ్వామిత్రుడు కూడా పశ్చాత్తాప్పడి ఇంకో అడవికి వెళ్లి తపస్సు చేసుకుంటాడు, ఆ పసికందుని కణ్వముని తెచ్చుకుని పెంచుకుంటాడు. ఆమెయే శకుంతల.

ఆలా చెప్పగానే... దుష్యంతుడు ఆమె క్షత్రియ కన్య అని తెలుసుకుని, తనని వివాహం చేసుకోమని అడుగుతాడు. శకుంతల, తన తండ్రి గారు వచ్చి తనని సమర్పిస్తారని చెపుతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.

ద్వితీయ వర్ధంతి

తిక్కవరపు బలరామరెడ్డి గారు

జననం : 19.03.1930 నిర్యాణం : 07.08.2020

చిరస్మరణీయం, ఆదర్శనీయం,
అనుసరణీయం వారి జీవితం.
ఆగష్టు 7, 2022న
వారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య : తిక్కవరపు హైమావతమ్మ

కుమారులు - కోడళ్ళు
టి.సీతారామిరెడ్డి - అనిత
టి.రామచంద్రారెడ్డి - సుజల

కుమార్తెలు - అల్లుళ్ళు
వేణుంబాక కమల - దినేష్‌రెడ్డి
మాజీ డి.జి.పి., ఆంధ్రప్రదేశ్
మారంరెడ్డి షీల - శివకుమార్‌రెడ్డి

మనుమరాళ్ళు, మనుమలు
సునయన, దిత్య, పూజిత, సంజన
రోహిత్, రితేష్, చేతన్

మరియు
మునిమనుమలు,
మునిమనుమరాళ్ళు



# ఎంసిఎ సెమిస్టర్‌లో..'కృష్ణచైతన్య' ఫస్ట్



ఇటీవల నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన ఎంసిఏ 3వ, 5వ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అగ్రస్థానం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ విద్యార్థిని రాణికుమారి 89 శాతం మార్కులతో యూనివర్శిటీ పరిధిలో ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. అదే విధంగా 88 శాతం మార్కులతో బి.లక్ష్మీప్రియ ద్వితీయ స్థానం, 87 శాతం మార్కులతో కె.లిఖిత తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఎంసిఏ 3వ సెమిస్టర్ ఫలితాల్లో జి.సుమజ 82 శాతం మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, కె.వీరలక్ష్మి 81 శాతం మార్కులతో ద్వితీయస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమశ్రేణి మార్కులు సాధించిన వారందరినీ వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యు.మల్లికార్జునయ్య, టి.జ్యోతి, అడ్మిన్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు, హెచ్ఓడి ఫణికుమార్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 'సెట్నెల్' అవగాహన సదస్సు




జిల్లా యువజన సంక్షేమశాఖ–సెట్నెల్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక వశిష్ట జూనియర్ కళాశాలలో యువతకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అధికారులు అవగాహన కలిగించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఏ.సురేష్ పాల్గొని యువత తమకు ఇష్టమైన కోర్సులను ఎంపికచేసుకుని కష్టపడి నైపుణ్యం సాధించి విజయశిఖరాలను అందుకోవాలన్నారు. నెహ్రూ యువకేంద్ర అధికారి ఏ.మహేంద్రరెడ్డి, సమాజసేవకులు టి.వెంకటేశ్వర్లు, సెట్నెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.పుల్లయ్య మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ మధు, వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు, సూపరింటెండెంట్ ఎం.డి గయాజ్ అహ్మద్, సెట్నెల్ అకౌంటెంట్ బి.శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేనను గెలిపించుకుంటాం



వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించుకుంటామని, పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు అందరం కృషి చేస్తామని కాపు సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లేశ్వరరావు చెప్పారు. ఇటీవల నెల్లూరులోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డిని కాపు సంక్షేమ సంఘం నాయకులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఇంటికీ తిరిగి ప్రజలకు జనసేన పార్టీ సిద్ధాంతలను తెలియజేస్తామన్నారు.




## నెల్లూరు కబుర్లు




# నెల్లూరులో మువ్వన్నెల జెండా రెపరెపలు

## జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో.. అజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు పూర్తికావస్తున్న విశేష సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో ఆగస్టు 1న 'అజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలు కోలాహలంగా జరిగాయి. పెద్దసంఖ్యలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు 3 వేల మందికి పైగా పాల్గొని నెల్లూరు పురవీధుల్లో మువ్వన్నెల జెండాలను రెపరెపలాడించారు. దేశభక్తి నినాదాలతో వీధులన్నీ మారుమ్రోగి పోయాయి. నగరంలోని గాంధీబొమ్మ విగ్రహ కూడలి వద్ద నుంచి విఆర్‌సి సెంటర్ మీదుగా కలెక్టరేట్ దాకా ర్యాలీ సాగింది. తొలుత ఆనం అరుణమ్మ మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విఆర్‌సి కూడలి వద్ద ఉన్న డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకుంటూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని సభాప్రాంగణంలో వక్తలు మాట్లాడుతూ అజాదీ కా అమృత్ మహోత్సవ్ విశిష్టత గురించి, స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరూ 'ఇంటింటా జాతీయజెండా' ఎగురవేసే కార్యక్రమం గురించి అవగాహన కలిగించారు. జిల్లా పంచాయతి అధికారి ఎం.ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధర్మరాజస్వామి దేవస్థానంలో..

# పూర్తయిన బ్రహ్మోత్సవ వేడుకలు



నెల్లూరు మూలాపేటలోని ద్రౌపది దేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానంలో గత 22 రోజులుగా మహాభారత ఘట్టాలను తలపింపజేస్తూ నేత్రపర్వంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ఈనెల 2తో పూర్తయ్యాయి. చివరిరోజు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం యుధిష్ఠర పట్టాభి షేకం (దర్బార్ అలంకారం) మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నాగభీమేశ్వరరావు, వసంతలక్ష్మి, మల్లికార్జున, కవిత దంపతులు, కుమార్ వ్యవహరించారు. ఆలయ ఇఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు జయప్రదంగా జరిగినందుకు తోడ్పడినవారందరికీ ఆలయ ఛైర్మెన్ రామకృష్ణ, ఇఓ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ రంగనాథునికి..

# 11 లక్షలకు పైగా రాబడి

నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో హుండీ రాబడి పెరిగింది. ఈనెల 2న భక్తులు సమర్పించిన హుండీ కానుకలు లెక్కించగా గత మార్చి 30 నుంచి ఆగస్టు 2వ తేది వరకు 11,76,250 రూపాయలు రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మెన్ శివకుమార్‌ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు, పర్యవేక్షణాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవలను

# ఆదర్శంగా తీసుకోవాలి

### నగర మేయర్ స్రవంతి




జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య, నాటకరంగ అభివృద్ధికి విశేష కృషిచేసిన బళ్ళారి రాఘవల జీవితాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను పురస్కరించుకుని ఆగస్టు 2న కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరో స్వాతంత్ర్యసమరయోధుల త్యాగాల ఫలితంగా మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, ఆ మహాను భావులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. ఆ త్యాగమయుల జీవిత చరిత్రలను అందరూ తెలుసుకోవాలని, వారి ఆశయాల బాటలో అందరూ పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ వాణి, డిపిఓ ధనలక్ష్మి, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ చెన్నుడు, స్వాతంత్ర్య సమరయోధులు కెవి చలమయ్య, డిఎస్‌డబ్ల్యుఓ వెంకటయ్య, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు కార్డుతో..

# ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

### జేసీ కూర్మనాథ్




ప్రతిఒక్కరూ ఓటరు కార్డుతో వారి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. అలా ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను ఆయన ఈనెల 1న నెల్లూరులోని కలెక్టరేట్‌లో ప్రారంభించి ఆ కార్యక్రమం వివరాలు తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని, తద్వారా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, టిజిపి స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, డిటిసి చందర్, డిపిఓ ధనలక్ష్మి, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, డ్వామా పి.డి తిరుపతయ్య, డిఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి వరద బాధితులకు..

# సింహపురి వైద్యసేవా సమితి చేయూత




గోదావరి జిల్లాల్లోని వరద బాధితులకు ఇటీవల నెల్లూరులోని సింహపురి వైద్యసేవా సమితి, జయభారత్ ఆసుపత్రి వారు సంయుక్తంగా తమవంతు చేయూతనందించారు. దాదాపు 2 లక్షల రూపాయల విలువచేసే మందులు, 500 కుటుంబాలకు సరిపడా 3 లక్షల రూపాయల విలువగల దుస్తులను డాక్టర్ చైతన్య, ఆసుపత్రి సిబ్బందితో కలిసి రెండు వాహనాల్లో తీసుకువెళ్ళి బాధితులకు అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ వాహనాలను తొలుత ప్రముఖ వైద్యులు డా.సివి సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. దాతలు పొన్నలూరు సీతా రామిరెడ్డి లక్ష రూపాయలు, మాగుంట స్నేహలత 22,500 రూపాయలు, ఇంకా అనేకమంది వదాన్యులు బాధితులకు అవసరమైన మందులను, పెద్దమొత్తాల్లో విరాళాలను అందించారని, తమ వైద్య బృందం నాలుగు వారాలపాటు గోదావరి జిల్లాల్లోని వరద ప్రాంతాలకు వెళ్ళి బాధితులకు వైద్యసాయం అందిస్తోందని, ఆ తర్వాత మరో వైద్యబృందాన్ని పంపుతామని జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తెలిపారు. సేవాసమితి ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివమౌర్య, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

## 'గడప గడప'లో కోవూరు ఎమ్మెల్యేకి కోలాహలంగా స్వాగతాలు



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి ఘనమైన స్వాగతం లభిస్తోంది. ఇటీవల ఆయన 'గడప గడపకు ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా పలు గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు పెద్దఎత్తున ఆయన్ను ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఈ మూడేళ్ళ వైకాపా పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం వెల్లువెత్తిస్తున్న పలు సంక్షేమ పథకాలను, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజలు వైకాపా ప్రభుత్వాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయని చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారికి చెప్పు, ప్రజల సమస్యలను తెలుసుకుని అప్పటికప్పుడు వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడకు వెళ్ళగా అక్కడి ప్రజలు, మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా చెన్నై, హైదరాబాద్‌లలోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నందువల్ల నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని కొంత ఆలస్యంగా ప్రారంభించడం జరిగిందని, ఈ విషయం ముఖ్యమంత్రికి కూడా తెలుసని ఆయన చెప్పారు. అయితే ఆ విషయాన్ని అర్థం చేసుకోకుండా కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తాను గడప గడపకు కార్యక్రమానికి రావడం లేదంటూ కావాలనే తనపై దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి ప్రతి పంచాయతీకి 20లక్షల రూపాయలను కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్లను ఆయన లబ్దిదారులకు అందజేశారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు, వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, ప్రసన్న తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, బుచ్చి నగర పంచాయతి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఎంపిపి శ్రీనివాసులు, ఎంపిడిఓ నరసింహా రావు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఏపిఎం లలితతో పాటు స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నందిమండపానికి ప్రారంభోత్సవం :

జొన్నవాడలోని ప్రసిద్ధమైన శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో పునర్నిర్మించిన నందీశ్వరుని రాతిమండపానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆగస్టు 1న పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. కొత్తగా నిర్మించిన రాతి సింహానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల మధ్య ఈ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ ఛైర్మెన్, ధర్మకర్తలు, ఇ.ఓతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

## మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులను అందరూ స్మరించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1న వెంకటాచలంలో జరిగిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఆయన పాల్గొని జాతీయనాయకుల వేషధారణతో వచ్చిన చిన్నారులతో కలిసి వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని మంత్రి ప్రారంభించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థుల దేశభక్తి నినాదాలతో, త్రివర్ణపతాకాల రెపరెపలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆగస్టు 1 నుంచి 15వ తేది దాకా అజాదీ కా అమృత్ మహోత్సవాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని, కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోనూ ఈ దేశభక్తి కార్యక్రమాల్లో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, ఎంపిడిఓ సుస్మిత, ఎంపిపి కవిత, జడ్పీటిసి మణి, వైస్ ఎంపిపి కోదండరామిరెడ్డి, జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ లత, ఉపాధ్యాయులు నజీర్‌బాషా, సుధారాణి, సుబ్బమ్మలతో పాటు పెద్దసంఖ్యలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.








శ్రీ మంచికంటి రాధాకృష్ణయ్య గారు

స్థాపకులు : వెంకటరమణ ఆర్కేడ్, ట్రంకురోడ్డు, నెల్లూరు.

# ఉత్తరక్రియలు

మాకు మార్గదర్శకులు, సౌమ్యులు, సహృదయులు

మంచి మనసున్న మా ఇంటి దైవం, మా పెద్దదిక్కు

## శ్రీ మంచికంటి రాధాకృష్ణయ్య గారు

తేది: 24.07.2022 ఆదివారం ఉదయం పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య - **మంచికంటి కాశీరత్నమ్మ**

కుమారుడు - కోడలు

**మంచికంటి సుబ్బరాయుడు - సంగీతలక్ష్మి**

కుమార్తెలు - అల్లుళ్ళు

**సుదర్శన - వెంకటేశ్వర్లు**

**సుజాత - కొండయ్య**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు**

ఇతర **కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు :** తేది. 08.08.2022 సోమవారం **సపిండీకరణం(పాత్తర్లు), వైకుంఠ సమారాధన**, నెల్లూరు, ముత్తుకూరురోడ్డు, బాబానగర్ వాషింగ్టన్ హోమ్స్‌లోని మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## కళ్యాణ వైభవం...!

### సల్మాన్ - ఫర్హీన



నెల్లూరు వాస్తవ్యులు షేక్ జాఫర్ కుమారుడు **డా॥ షేక్ సల్మాన్ అన్సారి - డా॥ షేక్ ఫర్హీన**ల నిఖా జూలై 24వ తేదీ, రిసెప్షన్ జూలై 25వ తేదీ నెల్లూరులో జరిగాయి. ఈ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను దీవించారు. నవ దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# 'ఆదిశంకర'లో..కన్నులపండువగా శ్రీనివాస కళ్యాణం

## పాల్గొన్న టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు



గూడూరులోని ఆది శంకర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన 'సర్వఅద్భుత మహాశాంతి యాగం'లో భాగంగా ఇటీవల టిటిడి ఆధ్వర్యంలో కన్నుల పండువగా శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరిగింది. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి - స్వర్ణ దంపతులు ఈ కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి టిటిడి బోర్డు ఛైర్మెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పలు దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదాల పక్షాన రంగారెడ్డి వినతి పత్రాన్ని అందించారు.

# విద్యాదాత.. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు అపారం

## - వర్ధంతి సభలో ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి



పేద విద్యార్థుల ఉన్నతికి మహనీయుడు దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి కొనియాడారు. కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 3న విద్యాదాత దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి (ఎన్‌బికెఆర్) 44వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలను వివరించారు. కోట మండలంలోని అనేక ప్రాంతాల అభివృద్ధికి కూడా ముఖ్యకారణం ఆయన స్థాపించిన ఈ విద్యా సంస్థలేనన్నారు. నేటికీ ఎన్‌బికెఆర్ కళాశాలలో విద్య నభ్యసించిన విద్యార్థులు ఎంతోమంది దేశవిదేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నారని అంటూ అదంతా ఆయన చలవేనన్నారు. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని ప్రస్తుతించారు. ఎన్‌బికెఆర్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలను రాష్ట్రంలోని అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి అపూర్వమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఎన్‌బికెఆర్ కాలేజీ అధ్యాపకులు, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

### ఆర్డీవో మురళీకృష్ణ



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించాలని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓటరు నమోదు, తొలగింపు తదితర అంశాలపై ఇటీవల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం 17 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలని, జాబితాలోంచి ఓటును తొలగించాలంటే తప్పనిసరిగా మరణ ధృవీకరణ పత్రం ఉండాలని ఆర్డీవో చెప్పారు.

# 15 వరకు అమృత్ మహోత్సవాలు



ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు గూడూరు పట్టణంలో 1వ తేదీ నుండి మొదలయ్యాయి. ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలని సూచిస్తూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలు 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కలిగించేందుకు ర్యాలీ చేపట్టామని వారు వివరించారు.

# మహోన్నత వ్యక్తి.. పింగళి వెంకయ్య







భారత పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఈ నెల 2వ తేదీ ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. గూడూరు ఆర్డీవో మురళీకృష్ణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య మహోన్నత వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. అలాగే భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు 'భారత రత్న' బిరుదు ప్రదానం చేయాలని భారతీయ సెక్షన్ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశిరెడ్డి ప్రజేందర్‌రెడ్డి భారత ప్రభుత్వాన్ని కోరారు. గూడూరు మండలం మంగళపూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పింగళి వెంకయ్య 146వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని 15వ వార్డు సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి జరిగింది.

# రేషన్ కోతలపై వినతులు



పేదల కడుపునింపే రేషన్ బియ్యం పథకాన్ని వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై గూడూరు తహశీల్దార్ బాలలీలారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, ఇస్రాయిల్, తిరుపాల్, నరసింహులు, వెంకటేశ్వర్లు నాయుడు, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్‌గా శ్రీకాంత్‌రెడ్డి



ఇటీవల తిరుపతిలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌ఛైర్మెన్‌గా ఎల్‌ఏపి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్నేహితులు ఆయనకు అభినందలు తెలిపారు.




గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పి.వి.కృష్ణయ్య సహకారంతో ఈ నెల 2న విజయలక్ష్మికి వీల్‌ఛైర్‌ను అందిస్తున్న రోటీర క్లబ్ అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, కార్యదర్శి రవికుమార్, బి.దశరథరామిరెడ్డి, శ్యామ్‌యాదవ్, మల్లు విజయ, కలికి జనార్ధన్ రెడ్డి తదితరులు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి పెదనాన్న స్వర్గీయ జార్జిరెడ్డి కుమారుడు వై.యస్.అనిల్‌రెడ్డిని ఇటీవల చెన్నైలో కలిసిన రొటేరియన్, వైకాపా మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, రొటేరియన్లు విఎస్ఆర్ స్కూల్ అధినేత బాలకృష్ణంరాజు, సురేష్‌రెడ్డి, రఘురామిరెడ్డి

ఈనెల 17లోగానే..

# సంగం, నెల్లూరు బ్యారేజీ పనులు

**- చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి**



నెల్లూరుజిల్లాలో చేపట్టిన సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణాల పనులు వేగవంతం చేశామని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆగస్టు 17వ తేదీలోగా పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నామని జలవనరులశాఖ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 1న ఆయన సంగం బ్యారేజీ నిర్మాణాల పనులను పరిశీలించారు. ఈ పనులు త్వరలోనే పూర్తికానున్నాయని తెలిపారు. నెల్లూరు బ్యారేజీ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఇఇ అనిల్‌కుమార్‌రెడ్డి, డిఇ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మహిళా క్రికెట్ పోటీలు

- విన్నర్స్‌గా 'సి' జట్టు

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరులో ఆరురోజుల పాటు ఉత్కంఠభరితంగా జరిగిన ఆంధ్రా సౌత్‌జోన్ మహిళల క్రికెట్ పోటీలు ఆగస్టు 1తో ముగిశాయి. నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ,బి,సి జట్లుగా విభజించి పోటీలు నిర్వహించగా, బి-సి జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో 'సి' జట్టు క్రీడాప్రతిభతో రాణించి విజయం సాధించింది. ఈ పోటీల్లో ఉత్తమ బ్యాట్స్ ఉమెన్‌గా శిరీష, ఉత్తమ బౌలర్‌గా కశ్వి, బెస్ట్ ఉమెన్ ఆఫ్ ద ప్లేయర్‌గా చరణి, అప్‌కమింగ్ ప్లేయర్‌గా కె.సాత్వికారెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్రా క్రికెట్‌బోర్డు ఛైర్మెన్ తీర్థ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి అబూబకర్, సిఐఎ నిర్వాహకులు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ శోభలు



సీ : శ్రావణ మాసంబు సౌభాగ్యధామంబు
సుదతుల కెల్లను శుభకరంబు
మంగళగౌరికి మంగళవారపు
మహిళల నోములు మంగళములు
వరముల నొసగెడి వరలక్ష్మి వ్రతములు
మగువల మార్గంబు మహిని జూడ
కన్యల కమనీయ కల్యాణమస్తులు
గౌరిపూజల తోడ కాంక్ష దీరు
జగతికి కృష్ణుని జన్మదినంబులు
రాఘవేంద్రునికి యారాధనములు
తే.గీ: పూజలొనరింప పూర్ణిమా పుణ్యతిథియు
మూడురంగుల జెండాకు వేడుకలును
సకల జనులును పొందగా సంతసమ్ము
చూడగా శ్రావణమునకు శోభగూర్చు!!..

**- వనం సుబ్రహ్మణ్యం**
94415 94897

# 'మహానాడు' ఏర్పాట్లపై.. టిడిపి నాయకుల చర్చ



జిల్లా మహానాడు ఏర్పాట్ల విషయమై ఈనెల 1న టిడిపి నాయకులు చర్చించుకున్నారు. ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ పరిధిలోని నాయకుల సమావేశంలో గ్రామస్థాయి కమిటీలు, మండల కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు తదితర విషయాలపై చర్చ జరిగింది. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్‌లు పరిశీలకులుగా హాజరయ్యారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్‌లతో పాటు కావలి, నెల్లూరు, కందుకూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జి నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని సమీక్ష నిర్వహించారు. టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, గుంటుపల్లి నాగేశ్వరరావు, గుడపాటి శ్రీనివాస్, దశరథాచారి, భాస్కర్‌రెడ్డి, పంతాని మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 18 నుంచి గొలగమూడిలో..

# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో కొలువైవున్న అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆలయంలో ఆగస్టు 18 నుంచి 24వ తేదీ వరకు స్వామివారి ఆరాధనోత్సవాలు పెద్దఎత్తున జరుగనున్నాయి. ఈ ఉత్సవాల ఏర్పాట్ల విషయమై ఈనెల 2న ఆలయ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యంతో కలిసి నెల్లూరు ఆర్డీఓ పి.కొండయ్య చర్చించారు. పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. స్వామివారి ఆరాధనోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక అందుకు తగినట్లుగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని, ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గొలగమూడికి భక్తుల రాకపోకలకనువుగా ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేయాలని, క్యూలైన్లు, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఓ సుస్మితారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మగ్గం ఉన్న వారందరికీ.. 'నేతన్న నేస్తం' ఇవ్వాలి

**- నెల్లూరులో చేనేత కార్మికుల ఆందోళన**



మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికి 'నేతన్న నేస్తం' పథకాన్ని వర్తింపజేయాలని, చేనేత రంగంలో ఉప కులవృత్తుల్లో ఉన్నవారికి ప్రత్యేక గుర్తింపుకార్డులు ఇచ్చి వారికి పెన్షన్ సదుపాయం కలిగించాలని, పాత గుర్తింపు కార్డులు కొనసాగించాలని కోరుతూ నెల్లూరు గాంధీబొమ్మ వద్ద ఇటీవల పెద్దసంఖ్యలో చేనేత కార్మికులు ఆందోళన చేశారు. చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాట్నాలు తిప్పుతూ ధర్నాందోళన నిర్వహించారు. చేనేతకార్మికులకు కల్పిస్తున్న సదుపాయాల్లో కొత్తకొత్త నిబంధనల పేరుతో కోత విధిస్తుండడం దారుణమని, గతంలో ఉన్న పెన్షన్లు రద్దుచేయడం అన్యాయమని, దీంతో నిరుపేదలైన చేనేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోందని ఈ ఆందోళనలో పాల్గొన్న చేనేత ఐక్యవేదిక కన్వీనర్ బుధవారపు బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక కో-కన్వీనర్ సురేష్, చేనేత నాయకులు రామనాధం రాజశేఖర్, సిహెచ్.సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నరసింహస్వామి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# యేడెం మస్తాన్‌రెడ్డి.. సేవలు చిరస్మరణీయం



అల్లూరు రామకృష్ణా విద్యాసంస్థల్లో దాదాపు 36 సంవత్సరాల పాటు ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులుగా పనిచేసి, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన యేడెం మస్తాన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఇటీవల అల్లూరులోని ఆర్‌కెజె కాలేజీ ఆవరణంలో ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కళాశాల పాలకవర్గ సభ్యులు.. కళాశాలలో 'సుమిత్ర బ్లాక్'ను కట్టించిన దాత కోట వాసుదేవ్, విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు..అవధాని కోట రాజశేఖర్, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు, పాఠశాల హెడ్మాస్టర్ ఎం.గంగిరెడ్డి పాల్గొని మస్తాన్‌రెడ్డి అయ్యవారి గుణగణాలను ప్రస్తుతించారు. విశ్రాంత ఉపాధ్యాయులు జిజె తంగరాజు, కొప్పు శ్రీనివాసులు పాల్గొని ఆయనతో ఉన్న తమ అనుబంధాన్ని వివరించారు. ఉపాధ్యాయులు కెవి సుబ్బారెడ్డి, కుటుంబసభ్యులు యేడెం శేషారెడ్డి, కిషోర్‌రెడ్డి, కళాశాల-పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు.

# టూకీగా...



మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో..

## 284 టన్నుల పసుపు కొనుగోలు

ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణంలో ఇటీవల ఏర్పాటుచేసిన పసుపు కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో141 మంది రైతులు తమ పసుపు పంటను విక్రయించుకున్నారు. గతనెల 18 నుంచి 31వ తేదీ వరకు రైతుల వద్ద నుంచి 284.69 టన్నుల పసుపుకొమ్ములను కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేణు తెలిపారు.

## రైతులకు సబ్సిడీ విత్తనాలు

జలదంకి మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, 50 శాతం రాయితీతో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందజేస్తున్నామని, కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులతో వచ్చి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారిణి శైలజ కోరారు.

## పెరిగిన ధరలపై 'ఐద్వా' నిరసన

నిత్యావసర ధరలు రోజురోజుకీ పెరుగుతుండడంతో పేదలు బతకలేకపోతున్నారని, ప్రభుత్వాలు వెంటనే శ్రద్ధ పెట్టి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటూ ఐద్వా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆత్మకూరుబస్టాండు వద్ద ఈనెల 2న ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, నాయకురాళ్ళు మస్తాన్‌బీ, శివకుమారి, పద్మ, సంపూర్ణ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు సాయం

నెల్లూరు ధనలక్ష్మీపురంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తమవంతు వితరణగా స్థానిక 'హెల్పింగ్ హ్యాండ్స్' సేవా సంస్థ వారు ఈనెల 2న విద్యాసామగ్రిని అందజేశారు. ఆ సంస్థ అధ్యక్షుడు విజయభాస్కర్, ఏసిబి ఇన్‌స్పెక్టర్ వేణు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ కుమారి, జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ గిరిధర్‌సింగ్, సభ్యులు మస్తానయ్య, మధు, సురేష్, పవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోనలో గరుడపంచమి వేడుకలు

రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువైవున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 2న గరుడ పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయంలో గరుడాళ్వారును పూలమాలలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు.

## గిరిజన విద్యార్థులకు నోటుపుస్తకాలు

బుచ్చిరెడ్డిపాళెంలోని సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 2న పంచేడు గిరిజన కాలనీలో ఉన్న పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలను వితరణగా అందజేశారు. వాటితో పాటు ప్లేట్లు, గ్లాసులు, స్టీల్ బాక్సులు, పెన్‌లు, పెన్సిళ్ళు కూడా ఇచ్చారు. ఎంఇఓ దిలీప్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు యజ్దానీబాషా పాల్గొన్నారు.

## గణేష్ మిత్రమండలి 17వ వార్షికోత్సవం

నెల్లూరులోని గణేష్ మిత్రమండలి 17వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 2న ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మిత్రమండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్‌తో పాటు కోవూరు ప్రసాద్, అభిలాష్, వినయ్ తదితరులు పాల్గొని నగరంలోని టౌన్‌హాలు జ్యోతి వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నిరుపేదలకు, యాచకులకు పండ్లు, వస్త్రాలు పంచిపెట్టారు.

## బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలే శ్రేయస్కరం

బిడ్డకు తల్లి పాలు ఎంతో మంచివని ఐసిడిఎస్ సిడిపిఓ అనురాధ చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 2న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!

## • గుండె నిండా..ఎగిరే మువ్వన్నెల జెండా • దేశభక్తి కార్యక్రమాలతో పులకిస్తున్న నెల్లూరు



*దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు పూర్తవుతున్న సంతోషసమయంలో నెల్లూరు జిల్లాలో ఆగస్టు 1 నుంచి దేశభక్తి కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మువ్వన్నెల పతాకల రెపరెపలతో, దేశభక్తి నినాదాలతో సింహపురి సీమ పులకించి పోతోంది. అందులోనూ నెల్లూరుజిల్లా అంటే స్వాతంత్ర్యసమరయోధులకు పుట్టినగడ్డ. గుండె నిండా దేశభక్తి గల జిల్లా..నెల్లూరు. మహాత్మా గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలోకి దూకి ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులెందరో ఈ జిల్లాలో ఉన్నారు. నేటికీ వారి స్వాతంత్ర్యస్ఫూర్తి జిల్లాప్రజలకు మహాదీప్తిగా వెలుగొందుతూనే ఉంది. ఈ నేపథ్యంలో 'అజాదీ కా అమృత్ మహోత్సవాలు' రావడంతో జిల్లా ప్రజలు వెంటనే స్పందించి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. భరతమాతకు చెయ్యెత్తి జైకొడుతున్నారు.*




'అజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 1 నుంచి 15వ తేది వరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని జయప్రదంగా చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపుకు సర్వత్రా ప్రజల నుంచి అపూర్వమైన స్పందన వెల్లువెత్తుతోంది. పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ చూసినా దేశభక్తి కార్యక్రమాలే ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగ మంతా దేశభక్తి కార్యక్రమాల నిర్వహణ పైనే ఎక్కువగా దృష్టిసారించింది. అందులోనూ ఈ అపూర్వమైన కార్యక్రమాల నిర్వహణ కోసం రాష్ట్రంలో రెండు జిల్లాలు ఎంపికైతే, అందులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉండటం జిల్లాకు ఎంతో గర్వకారణం. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయపతాకంతో సెల్ఫీలు దిగడంతో పాటు దేశభక్తిని పెంపొందించే విధంగా సదస్సులు, చర్చలు, వ్యాసరచనలు, క్విజ్ పోటీలు, నాటకాలు, సంగీతం, చిత్రలేఖనం వంటి కళాత్మక రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. దేశస్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను, స్వాతంత్ర్యయోధులను అందరూ మనసారా స్మరించుకుంటున్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు ర్యాలీలు నిర్వహించి, ఇంటింటికి తిరిగి 'ఇంటింటా జాతీయజెండా' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 2వ తేదీన స్వాతంత్ర సమరయోధులు, జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య, ప్రఖ్యాత రంగస్థల కళాకారుడు బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 3వతేదీన స్వాతంత్ర్య సమరయోధుడు కాకాని వెంకటరత్నం జయంతి ఉత్సవాలతో పాటు అనేకమంది స్వాతంత్ర సమరయోధులను గుర్తుచేసు కుంటూ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో సదస్సులు నిర్వహించారు. 4వ తేదీన దేశభక్తి గీతాలపై పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. 5వ తేదీన దేశభక్తి ప్రతిబింబించే విధంగా నాటకాలు, ఏకపాత్రాభినయాలు ఏర్పాటు చేశారు.

### 7న దేశభక్తి నినాదాలతో.. భారీగా ర్యాలీలు :

ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 6న దేశభక్తిని పెంపొందించే ప్రదర్శనలు నిర్వహించి, 7వ తేదీన పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించేందుకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు. 8వ తేదీన చిత్రలేఖనం, వక్తృత్వం, చర్చలు, గోడ పత్రాల తయారీ, పెయింటింగ్ వంటి రంగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 9వ తేదీన దేశభక్తిని ప్రబోధించే సాంస్కృతిక కార్యక్రమాలు, 10న మహనీయుడు వివి గిరి జయంతి ఉత్సవాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఆగస్టు11న పాదయాత్రలు, 12న క్రీడల పోటీలు పెద్దఎత్తున చేపట్ట నున్నారు. ఈనెల 13 నుంచి 15వ తేది దాకా ఇంటింటా మువ్వన్నెల పతాకను రెపరెపలాడించేందుకు ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. 13న జాతీయ పతాకంతో సెల్ఫీలు దిగుతారు. 14న స్వాతంత్ర సమరయోధుల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను సత్కరిస్తారు. ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాలతో భారీఎత్తున పాద యాత్రలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ఆగస్టు నెల 11 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు, చారిత్రాత్మక కట్టడాలు వంటి ప్రదేశాలలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నెల్లూరులో జరిగే దేశభక్తి కార్యక్రమాలను జిల్లా పరిషత్తు, కలెక్టరేట్‌లోని తిక్కనభవన్, శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేలకోట్ల దోపిడీ

## ○ సిబిఐ విచారణ జరిపించాలి

**- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి**



దేశంలో ఎక్కడా లేనంత అవినీతి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, గత మూడేళ్ళుగా అడ్డూ అదుపూ లేకుండా అవినీతిపర్వం సాగిపోతూనే ఉందని, ధాన్యం కొనుగోళ్లలో జరిగిన వేలకోట్ల దోపిడీపై కేంద్రప్రభుత్వం వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 3న నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కలసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళలో గత మూడేళ్ళుగా వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఆరుగాలం కష్టించి పనిచేసి అందరికీ అన్నం పెట్టే రైతన్నల కడుపుకొట్టి నాయకులు వేలకోట్ల రూపాయలు దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రాష్ట్రంలో కొనుగోళ్ళు జరగలేదని, రైతన్నలు ఒక పుట్టి ధాన్యాన్ని కేవలం 11వేల నుంచి 12,500 రూపాయలకు, అతి తక్కువ ధరకు అమ్ముకుని పుట్టికి సరాసరి 4వేల రూపాయల దాకా నష్టపోయారని ఆయన తెలిపారు. కనీస మద్దతుధర 16,500 రూపాయలైనా దళారులు, అధికారులు, నాయకులు అంతా కలిసి రైతులను దగా చేశారన్నారు. తరుగు పేరుతో ఒక్కో పుట్టికి సుమారు 350 కేజీల దాకా ధాన్యం తీసుకుని అన్నదాతలను నిలువునా దోచుకున్నా రన్నారు. అధికారులు నాయకులకు అడ్డగోలుగా సహక రిస్తున్నందువల్లనే రాష్ట్రంలో దళారీవ్యవస్థ మితిమీరిపోయి రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. కేంద్రప్రభుత్వం స్పందించి, ఈ వ్యవహారాలపై విచారణ జరిపించి, రైతులను దోపిడీచేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# 17న జిల్లాకు సిఎం?

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగస్టు 17న జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉందంటున్నాయి అధికార వర్గాలు. ఆ మేరకు వారికి ప్రాథమిక సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణాలు అనుకున్న విధంగానే ఆగస్టు 17వ తేదీకల్లా పూర్తిచేసేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన కృషిచేస్తున్న నేపథ్యంలో ఆ పనులు ఇటీవలే ముగింపు దశకు చేరుకున్నాయి. దీంతో సిఎం 17న వచ్చి ఆ బ్యారేజీలను ప్రారంభించవచ్చని భావిస్తున్నారు. అయితే, సిఎం పర్యటన ఖరారు విషయం ఇంకా అధికారంగా తెలియలేదు!

## చిరు వ్యాపారులకు.. 'జగనన్న తోడు'

**22,041 మందికి 22.04 కోట్లు**

'జగనన్న తోడు' పథకం కింద జిల్లాలో 22,041 మంది చిరువ్యాపారులకు 22.04 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణసాయంగా అందజేస్తూ, ఆ మొత్తాన్ని ఈ నెల 3న విడుదల చేశారు. చిరువ్యాపారులకు ముఖ్యమంత్రి అండగా ఉంటూ, తక్కువ వడ్డీకే రుణాలు అందించి ఆదుకుంటున్నా రని కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున సాయం అందించడం జరిగిందన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 5,560 మంది చిరువ్యాపారులకు 5.56 కోట్ల రూపాయలను, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి 16,481 మందికి 16.48 కోట్ల రూపాయలను అందించడంతో చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మైపాడు శివాలయంలో.. మహా కుంభాభిషేక మహోత్సవాలు

ఇందుకూరుపేట మండలంలోని మైపాడులో ఉన్న ప్రసిద్ధమైన శివాలయం.. శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 5 నుంచి 7వ తేది వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. చోళరాజులు నిర్మించిన ఈ ప్రాచీన ఆలయం ఎంతోకాలం నుంచి భక్తులకు కొంగుబంగారంగా ఉంది. 2004లో ఈ ఆలయంలో కుంభాభిషేకాలు జరిగాయి. ఈ 18 ఏళ్ళ తర్వాత మళ్ళీ ఇప్పుడు ఆ ఉత్సవాలకు వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కుర్తాళం పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై ఆదివారం వరకు జరుగుతాయి. శుక్రవారం ఈ ఉత్సవాలకు అంకురార్పణతో పాటు సామూహిక వరలక్ష్మీ వ్రతం కూడా జరుగుతుందని, ఆదివారం జరిగే మహాకుంభాభిషేక మహోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని కళ్యాణ్‌రెడ్డి తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో.. నెల్లూరు క్రీడాకారులకు పతకాలు



ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి 'శాప్' యోగా పోటీల్లో నెల్లూరు జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. అందులో ముగ్గురికి బంగారుపతకాలు లభించడం విశేషం. 8-10ఏళ్ళలోపు బాలుర విభాగంలో సాధన్ (కోవూరు), 14-16 ఏళ్ళలోపు బాలికల విభాగంలో దివ్య (కోవూరు) బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. 35-45 ఏళ్ళలోపు విభాగంలో కోవూరుకు చెందిన శ్రీనివాసులుకు వెండిపతకం లభించింది. అదేవిధంగా మహిళా విభాగంలో 35-45ఏళ్ళలోపు వారికి నిర్వహించిన పోటీలో నెల్లూరుకు చెందిన కావ్య బంగారు పతకం సాధించగా, 45 ఏళ్ళకు పైబడిన వారి విభాగంలో నెల్లూరుకు చెందిన డా.శివరామ్ కాంశ్య పతకం గెలుచుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర శాప్ యోగా కోచ్ వెంకటేశ్వర్లరావు చేతులమీదుగా పతకాలు అందజేశారు. ఈ పోటీలకు నెల్లూరుజిల్లా జట్టుకు కోఆర్డినేటర్లుగా ప్రసన్న, రవీంద్ర వ్యవహరించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను వారు అభినందించారు.

# మళ్ళీ శీలపరీక్ష దిశగా పవన్ కళ్యాణ్!?

జనసేన పార్టీ అధినేతగా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రతిష్టను రాజకీయంగా దెబ్బతీసే పరిణామాలు వెలుగు చూస్తున్నాయా? ఆయన రాజకీయ ప్రయాణాన్ని ఇవి 'డిస్ క్రెడిట్' చేస్తాయా?

గత పది, పదిహేను రోజులలో సోషల్ మీడియా (యూ ట్యూబ్)లో వైరల్ అవుతున్న కొన్ని "విశ్లేషణ"లు చూస్తుంటే ఈ అనుమానం కలుగుతోంది. తెలుగుదేశం పార్టీతో వచ్చే ఎన్నికల్లో కలవకుండా విడిగా పోటీచేయడం కోసం, పవన్ కళ్యాణ్ – మధ్యవర్తుల ద్వారా వైయస్సార్సీపీ నుంచి డబ్బు తీసుకుంటున్నారంటూ యూట్యూబ్‌లో ఓ "విశ్లేషణ" వచ్చింది. అది సంచలనం అయింది. యూట్యూబే గదా అని విస్మరిస్తే, కుదరదు. జనంలోకి పాదరసంలా పాకిపోతుంది. డ్యామేజ్ చేసేస్తోంది.

2014 ఎన్నికలకు ముందు 'జనసేన' పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్, నిజానికి ఇప్పటికే రాజకీయంగా ఎక్కడో ఒక రేంజ్‌లో ఉండాల్సినవారు. కానీ, 'జనసేన'కు సినీ లక్షణాలు తప్ప రాజకీయ లక్షణాలు లేకపోవడంతో, ఎనిమిదేళ్ల తరువాత కూడా ఆయన మాత్రం బయలుదేరిన చోటుకంటే కూడా రెండు వీసాలు తక్కువగా ఇప్పుడు ఉన్నారేమో అనిపిస్తోంది. విఠలాచార్య జానపద సినిమాల్లో హీరోలు కాంతారావు, ఎన్టీరామారావు చెక్క గుర్రం మీద అదేపనిగా ఊగినట్టే పవన్ కళ్యాణ్ కూడా ఏపీ రాజకీయంపై ఊగుతూ, బయలుదేరిన చోటే ఉన్నారు. ప్రయాణం మాత్రం కొనసాగుతూనే ఉంది.

అయితే, ఈ రాజకీయ ప్రయాణంలో (2019 ఎన్నికలను మినహాయిస్తే) ఆయనకు రాజకీయంగా ఓ స్పష్టత ఉన్నది. భావ వ్యక్తీకరణలో కన్ఫ్యూజన్ లేదు.

జగన్ నుంచి రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో ఆయన 2014 ఎన్నికలకు ముందు రాష్ట్రమంతా హెలికాప్టర్‌లో సుడిగాలి పర్యటనలు చేశారు. టీడీపీని గెలిపించమని కోరారు. అంటే.. రాజకీయంగా ఓ స్పష్టతతో ఆయన ఓటర్ల దగ్గరకు వెళ్లారన్న మాట. జనం కూడా నీరాజనాలు పట్టారు. టీడీపీ గెలిచింది. ఆ గెలుపులో కొంత క్రెడిట్ ఆయన అకౌంట్‌లో కూడా పడింది.

2019 ఎన్నికలు వచ్చేసరికి, టీడీపీని ఎన్నికల ప్రసంగాల్లో గట్టిగానే విమర్శిస్తూ రాష్ట్రంలో తిరిగారు గానీ పనిలోపనిగా వైయస్సార్సీపీని కూడా పవన్‌కళ్యాణ్ అంతకు మించి విమర్శించారు. ఇదేమి "పొలిటికల్ స్టాండో" ఓటర్లకు అర్థం కాలేదు. ఒక ప్రతిపక్ష పార్టీగా అధికారపక్షమైన టీడీపీని విమర్శించడం వరకు ఓకే గానీ, తోటి ప్రతిపక్షమైన వైయస్సార్సీపీని విమర్శించడం ఏమిటి అనే ప్రశ్నలు జనంలో గట్టిగానే బయలుదేరాయి. అందులోనూ, టీడీపీ పేరు చెబితే, జనం అసహనంతో పూనకానికి లోనవుతున్న రోజుల్లో ఆయన వైయస్సార్సీపీని విమర్శించడాన్ని కాపులు కూడా జీర్ణించుకోలేకపోయారు. వ్యక్తిగతంగా జగన్‌ను విమర్శించాలని పవన్‌కళ్యాణ్ అనుకుని ఉంటే టీడీపీతో 2014లో లాగా "అధికారికం"గా పొత్తు పెట్టుకుని ఉండాల్సింది. ఆయన రాజకీయానికి మరింత విశ్వసనీయత ఉండేది. జనంలో కనిపించిన ఆ కన్ఫ్యూజన్ వల్ల, పవన్‌కళ్యాణ్ పెద్ద మూల్యమే చెల్లించారు. 2019 ఎన్నికల ఫలితాల్లో అది స్పష్టంగా కనిపించింది.

గతం గతః. అయిందేదో అయిపోయింది.

ఇప్పుడు, వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలకు పవన్‌కళ్యాణ్ సమాయత్తమవుతున్నారు. ఆయన వ్యక్తం చేస్తూ వస్తున్న 'వైయస్సార్సీపీ వ్యతిరేక' వైఖరిలో మాత్రం మార్పు ఏమీ లేదు.

ఆయన సోదరుడు మెగాస్టార్ చిరంజీవి ముఖ్యమంత్రి జగన్‌తో వీలైనంత సన్నిహితంగా ఉంటుంటే, పవన్‌కళ్యాణ్ మాత్రం వీలైనంత దూరంగా ఉండడాన్ని మనం (అంటే ఆంధ్రదేశం మొత్తం అని) చూస్తున్నాం. ఇదొక విచిత్రం.

రానున్న ఎన్నికలకు జనసేనను సమాయత్తం చేసే క్రమంలో, వైయస్సార్సీపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూస్తానని కూడా పవన్‌కళ్యాణ్ పదేపదే ప్రకటించారు. దీంతో, ఆంధ్ర రాజకీయాలు కాస్తంత వేడెక్కాయి.

వైయస్సార్సీపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూడడానికి గాను ఆయన టీడీపీతో పొత్తుకు పచ్చజెండా ఊపుతున్నట్టే అని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. కానీ, టీడీపీతో ఆయన పొత్తుకు వెళ్లడం కాకుండా తనతోనే టీడీపీ పొత్తుకు రావాలన్న భావంతోనే ఆయన ఆ ప్రకటనలు చేశారని జనానికి తరువాత తరువాత అర్థం అయి నవ్వుకున్నారు. దీంతో, టీడీపీ కూడా సహజంగానే ఆయన బహిరంగ ప్రకటనలను పట్టించుకోలేదు. పవన్‌కళ్యాణ్ కూడా టీడీపీ మద్దతు కోసం ఎటువంటి ప్రయత్నమూ చేసినట్టు కనిపించలేదు. గాలిలోకి ఓ రాయి విసిరి ఊరుకున్నారు. టీడీపీ కూడా ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేసింది.

దాంతో, ఆయన ప్రకటించిన రెండో ఆప్షన్ వైపు తన రాజకీయ ప్రయాణం ప్రారంభించడానికి సన్నాహాలు ప్రారంభించినట్టుగా కనపడుతోంది.

ఇందులో తప్పు పట్టవలసింది ఏమీ లేదు. ఆయన పార్టీ, ఆయన ఇష్టం. ఆయనకు నచ్చిన మార్గంలో ప్రయాణించే హక్కు, స్వేచ్ఛ ఆయనకు ఉన్నాయి.

వచ్చే దసరా నుంచి రాష్ట్రమంతా పర్యటించడానికి ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు.

బహుశా, సొంతంగా పోటీ చేయాలనే ఆలోచనల్లో భాగంగానే ఆయన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు సందర్శిస్తూ, గతంలో ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు లక్ష రూపాయల వంతున ఆర్థిక సాయం చేస్తున్నారు. నిజానికి ఇది వేనోళ్ల అభినందించ తగ్గ గొప్ప పని. ఒక రాజకీయపార్టీగా ఇప్పటికే దాదాపు నాలుగొందల (అంకె తప్పు అయితే క్షమించాలి) కుటుంబాల వారిని పవన్ కళ్యాణ్ అక్కున చేర్చుకున్నారు.

సరిగ్గా... ఇక్కడే, సోషల్ మీడియా విశ్లేషకులు ఒకరు రంగంలోకి దిగారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకోకుండా ఉండడం కోసం, పవన్ కళ్యాణ్ – వైయస్సార్సీపీ నుంచి భారీగా డబ్బు తీసుకుంటున్నారంటూ యూట్యూబ్ ఛానల్‌లో ఒక విశ్లేషణ వదిలారు. ఈ డబ్బంతా "అదే" అన్నారు. ఈ యూట్యూబ్ 'దాడి' జనసేనను గట్టిగానే తాకినట్టు కనపడుతోంది.

ఈ విశ్లేషణలు ఉన్న వీడియోను పవన్‌కళ్యాణ్ బృందం యూట్యూబ్‌కు ఫిర్యాదు చేసి తీయించేసింది అంటూ మరో వీడియో యూట్యూబ్‌లో ప్రత్యక్షమైంది. 'నా ఛానెల్ మూయిస్తే, నాకు ఇంకా పది ఛానెళ్లు ఉన్నాయ్. బస్తీ మే సవాల్... డోంట్ కేర్...!' అంటూ కుండబద్దలు కొడుతున్నట్టుగా మరో వీడియో యూట్యూబ్‌లో దర్శనం ఇచ్చింది. వైయస్సార్సీపీ నుంచి ఆయన డబ్బు తీసుకుంటూ ఉండకపోతే, అంత ఉలికిపాటు ఎందుకని ఆ యూట్యూబర్ ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ లాంటి అత్యంత జనాకర్షక పర్సనాలిటీకి సంబంధించి ఓ కొత్త విషయం ఎవరైనా చెబితే, నిముషాల్లో అది జనంలో పాకిపోతుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఏముంది? మెగా స్పీడ్‌తో జనంలోకి వెళ్లిపోతుంది.

అందువల్లనే, ఈ తరహా "ఆరోపణ"లు పవన్ కళ్యాణ్ ప్రతిష్టకు భంగం కలిగించడం సహజం.

మామూలుగా ఏ వెంకటరావో..., అప్పారావో అయితే, వారి ప్రతిష్టకు భంగం కలిగే పుకార్లు వస్తే నష్టం లేదు. ఎవరూ పట్టించుకోరు. ఒకవేళ పట్టించుకున్నా... రెండు రోజుల తరువాత ఎవరికీ గుర్తుండదు.

కానీ, పవన్‌కళ్యాణ్ విషయం అలా కాదు.

ఇటువంటి ఆరోపణలను విస్మరిస్తే, పవన్ కళ్యాణ్‌కు రాజకీయంగా 2019 తరహా నష్టం జరుగుతుంది.

అది ఎలాగంటే....

వైయస్సార్సీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తాను అని చెప్పి, సొంతంగా పోటీ చేయడానికి డిసైడ్ అవ్వడం ద్వారా వైయస్సార్సీపీ వ్యతిరేక ఓటును వీలైనంత ఎక్కువగా చీల్చడానికి పవన్ కళ్యాణ్ నడుం బిగించారనే అపవాదుకు ఆయన గురి కావలసి ఉంటుంది.

ఇటువంటి తరహా అపవాదునే ఆయన 2019 లోనూ ఎదుర్కొన్నారు.

అప్పుడు కూడా ఆయన స్వతంత్రంగా పోటీ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. దాని తప్పొప్పులను విమర్శించాల్సిన ఆయన టీడీపీ కంటే వైయస్సార్సీపీని గట్టిగా విమర్శిస్తూ వెళ్లడంతో... జనానికి అనుమానం వచ్చేసింది. టీడీపీకి పరోక్ష సాయం చేయడానికి ఆయన వైయస్సార్సీపీని గట్టిగా విమర్శిస్తున్నారనే భావం జనంలో విస్తృతంగా వ్యాపించింది.

'జనసేనకు ఓటు వేద్దాం, మనోడే కదా!' అనుకున్న వాళ్ళు కూడా మూకుమ్మడిగా జగన్‌కు ఓటు వేశారు.

ఇప్పుడు కూడా, అటువంటి ఇబ్బందినే పవన్‌కళ్యాణ్ ఎదుర్కొనవచ్చు. అందుకు తగిన కారణాలు లేకపోలేదు.

★ జనసేన అనేది టీడీపీ మిత్రపక్షం అనే భావం మామూలు జనంలో బాగా స్థిరపడి పోయింది.

★ చిరంజీవి 'పోస్ట్ పెయిడ్'..., పవన్ కళ్యాణ్






'ప్రీ పెయిడ్' అంటూ 2014లో సోషల్ మీడియాలో టీడీపీ వ్యతిరేకులు చేసిన భారీ ప్రచారం ఈ అభిప్రాయాన్ని బాగా స్థిరపరిచింది.

★ వైయస్సార్సీపీ మీద పవన్‌కళ్యాణ్ గత ఏడెనిమిదేళ్లుగా అడపా.. దడపా చేస్తున్న విమర్శలు, వ్యంగ్య వ్యాఖ్యానాలు ఈ అభిప్రాయాన్ని ఇంకా ఇంకా బలపర్చుతూ వచ్చాయి.

★ జనసేన ప్రధాన ఓట్ బ్యాంకు కాపులే కదా!

★ ఈ కులంలో వైయస్సార్సీపీ పట్ల అంత సద్భావన లేదని పవన్‌కళ్యాణే ఒకసారి అన్నట్టు గుర్తు. కాపు నేతలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు, వివిధ కుల వేదికలపై.

★ ఈ నేపథ్యంలో జనసేన స్వతంత్రంగా (బీజేపీని కూడా కలుపుకునే లే...) పోటీచేస్తే, కాపు సామాజికవర్గం హర్షిస్తుందా? వైయస్సార్సీపీ వ్యతిరేక ఓటును చీల్చనివ్వను అని ప్రకటనలు చేసి, ఇప్పుడు చీల్చే ప్రయత్నం చేస్తూ, వైయస్సార్సీపీకి లబ్ది చేకూర్చే పని చేస్తున్నారని భావించదా?

★ అప్పుడు 2019లో జగన్ వైపు మళ్ళినట్టుగా – ఇప్పుడు టీడీపీవైపు ఈ సామాజికవర్గం గంపగుత్తగా మళ్ళదా? అప్పుడు, జనసేన ఆరు శాతం ఓటింగ్‌కు పరిమితమైనట్టు ఇప్పుడు కూడా ఆరేడు శాతానికి పరిమితం కాదా?

పవన్‌కళ్యాణ్‌పై 2019లో జగన్ బృందం, వైయస్సార్సీపీ సోషల్ మీడియా ప్రచారం చేసినట్టు, ఈసారి టీడీపీ వాళ్ళు పవన్‌కళ్యాణ్‌పై వీలైనంత



నెగెటివ్ ప్రచారం చేయరా? (సోషల్) మీడియా విప్లవం వెల్లివిరుస్తున్న ఈరోజులలో ఆ ప్రచారం జనంలోకి వెళ్ళడానికి కొద్ది నిముషాల వ్యవధి కంటే ఎక్కువ సమయం పడుతుందా?. అప్పుడు, ఆయన వైయస్సార్సీపీని, జగన్‌ను ఎంత నిశితంగా విమర్శించినా, జనం సీరియస్‌గా తీసుకుంటారా? 'మాకు తెలుసులెద్దూ...' అంటూ ఓ వంకర నవ్వు విసరరా, ఆయన్ను చూసి!?.

ప్రతిపక్షంలో ఉన్న టీడీపీని విమర్శిస్తే, జనం నవ్వుతారు కూడా. ఎందుకంటే, జనసేన, టీడీపీ రెండూ ప్రతిపక్ష పార్టీలే కనుక. అందువల్ల, ఆయన అటు వైయస్సార్సీపీని విమర్శిస్తూ మాట్లాడినా ఇబ్బందే, ఇటు టీడీపీని విమర్శిస్తూ మాట్లాడినా ఇబ్బందే.

ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ప్రభావశీలంగా జనసేన వ్యవహరించాలి అని పవన్‌కళ్యాణ్ భావిస్తూ ఉంటే.. రెండు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఆయన ముందు ఉన్నాయి.

1. నేరుగా వైయస్సార్సీపీతో పొత్తు పెట్టుకోవడం. 2. లేదా టీడీపీతో పొత్తు పెట్టుకోవడం.

ఏం మొహమాటం పడాల్సిన పని లేదు. వచ్చే ఆరోపణలు ఎటుదిరిగీ వస్తాయి.

ఓ పాతిక ఎంఎల్ఏ సీట్లు, ఓ రెండు మూడు ఎంపీ సీట్లు, ఓ రెండు మంత్రి పదవులు, ఓ రెండు మూడు ఎమ్మెల్సీ పదవులు అడిగితే జగన్, నో అని అనకపోవచ్చు. చంద్రబాబూ 'నో' అనకపోవచ్చు.

రాజకీయాల్లో ఎవరూ శాశ్వత విరోధులు, మిత్రులు ఉండరు కదా!

వైయస్సార్సీపీతో పొత్తుపెట్టుకుని పోటీచేస్తే, పోటీచేసిన స్థానాల్లో మూడొంతులు గెలవడం ఖాయం. జనానికి కూడా క్లారిటీ ఉంటుంది. టీడీపీకీ, చంద్రబాబునాయుడుకు ఇప్పటికే ఈ విషయంలో క్లారిటీ వచ్చిందని టీడీపీ మిత్రులు కొందరు అంటున్నారు.

అలాకాదు అనుకుంటే... టీడీపీతో అయినా పవన్‌కళ్యాణ్ నేరుగా పొత్తు పెట్టుకోవచ్చు. అప్పుడూ ఆయన రాజకీయంపై జనానికి క్లారిటీ ఉంటుంది. అప్పుడు కూడా మూడొంతుల స్థానాల్లో గెలవడం ఖాయం.

నిజానికి, తమతో పవన్ పొత్తు పెట్టుకోవడం అనేది ప్రధాన ప్రత్యర్థిపార్టీలైన వైయస్సార్సీపీ, టీడీపీలకు పెద్ద ముఖ్యంగా కనిపించడం లేదు, క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తుంటే.

తన రాజకీయ భవిష్యత్ రీత్యా, ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకోవడం పవన్ కళ్యాణ్‌కే ముఖ్యం.

ఈ రెండు పొత్తు ఆప్షన్లు కాదని, స్వతంత్రంగా పోటీ చేయాలని భావిస్తే.. పవన్‌కళ్యాణ్ రాజకీయంగానే కాక, ఇమేజ్ పరంగా కూడా నష్టపోతారు. శీల పరీక్షకు గురి అవుతారు.

పవన్‌పై ప్రజలలో 'ప్యాకేజీ' ఆరోపణలు వెల్లువెత్తుతాయి. సెల్ఫ్‌గోల్ చేసుకున్నట్టు అవుతుందేమో ఆయన ఆలోచించాలి. 'తాడి చెట్టు ఎందుకు ఎక్కావ్' అంటే.... 'దూడ మేత కోసం' అని జనాన్ని నమ్మించడం ఈ రోజుల్లో చాలా కష్టం. జనం బాగా తెలివిమీరి పోయారు.

**- భోగాది వేంకట రాయుడు**

# ధన్యజీవి... మన వెంకయ్య

(3వ పేజీ తరువాయి)



మంత్రులందరితో తరచూ సమావేశం ఏర్పాటు చేసిన విషయం మనకు తెలిసిందే. ప్రాజెక్టులకు అనుమతి సాధించేందుకు, నిధులు మంజూరు చేయించేందుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టేందుకు కేంద్రమంత్రులందరితో మాట్లాడడం ఆయన తన బాధ్యతగా చేపట్టారు. 35 మంది కేంద్రమంత్రులను తన కార్యాలయానికి పిలిపించి, ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరిగేందుకు కృషి చేశారు. ఉన్నత విద్యాసంస్థలు, శిక్షణా సంస్థలు, వైద్య సంస్థలతో పాటు ఇవాళ రాష్ట్రంలో ఉన్న ఐ.ఐ.టి, ట్రిపుల్ ఐటీ, ఈ.ఎస్.ఆర్, ఎయిమ్స్, ఐ.ఐ.ఎం. లాంటి ఏ సంస్థ అయినా ఆయన చొరవతో వచ్చినవే. పోలవరం కోసం తెలంగాణలోని గ్రామాలను విలీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆర్డినెన్స్ జారీ చేయించడం మొదలుకుని పార్లమెంట్‌లో పోలవరం ఆమోదింపజేసే వరకూ ఆయన చేసిన కృషి నిరుపమానమైనది.

## కేంద్రంలో కీలక పదవులు

2014లో నరేంద్రమోదీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ అఖండ మైన మెజారిటీతో గెలిచిన తర్వాత వెంకయ్యనాయుడు పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖలతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు, ఆ తర్వాత కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ బాధ్యతలు కూడా చేపట్టారు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా పార్లమెంట్ సాఫీగా సాగేలా చూడడంలోనూ, కీలక చట్టాల విషయంలో ఏకాభిప్రాయం సాధించడం లోనూ ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. రాజ్యసభలో పార్టీ మైనారిటీలో ఉన్న సమయంలో అత్యంత కీలక చట్టాలను ఆమోదింపచేసేందుకు ఆయన ప్రతిపక్ష పార్టీల నేతలతో మాట్లాడి వారి మద్దతు సంపాదించే వారు, ఆయన అన్ని పార్టీల మద్దతును సేకరించినందువల్లే భూసేకరణ బిల్లు,రియల్ ఎస్టేట్ బిల్లు వంటి ముఖ్యమైన చట్టాలను ఆమోదించ గలిగారు. అదే విధంగా ప్రతిపక్ష పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆయన జీఎస్టీ బిల్లుపై ఏకాభిప్రాయం సాధించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేశారు. నాటి ఆర్థిక మంత్రి శ్రీ అరుణ్ జైట్లీతో కలిసి స్వయంగా సోనియా ఇంటికి వెళ్ళి, జి.ఎస్.టి.కి మద్దతు కూడగట్టారు. లోక్ సభలో జీఎస్టీ బిల్లు ఆమోదం పొందిన మరుసటి రోజు ఆ బిల్లు విషయంలో ఏకాభిప్రాయం సాధించేందుకు వెంకయ్యనాయుడు చేసిన కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించి అభినందించారు.

## భారత ఉపరాష్ట్రపతిగా సమున్నత పదవి

2017లో దేశమంతా ఉపరాష్ట్రపతిగా ఎవర్ని నియమిస్తారనుకుంటున్న సమయంలో ఆ పదవి నిర్వహించేందుకు వెంకయ్య కంటే సమర్థుడు మరొకరు లేరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పార్టీ నేతలంతా భావించారు. వెంకయ్యకున్న అపారమైన రాజకీయ అనుభవం, పార్లమెంటరీ వ్యవహారాల్లో అందెవేసిన చేయి కావడంతో రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయనకంటే మించిన వారు దొరకరని బిజెపి నాయకత్వం భావించింది. ఫలితంగా ఆయన రెండవ రాజ్యాంగ ఉన్నత పదవి స్వీకరించి, ఆ పదవికి వన్నె తీసుకొచ్చేందుకు అహరహం కృషి చేశారు. పార్లమెంటరీ ప్రమాణాలు కాపాడడమే కాదు, రాజ్యసభ సభ్యులు తమ బాధ్యత గుర్తెరిగేలా చేశారు.పార్లమెంటరీ కమిటీలు సజావుగా సాగేందుకు తోడ్పాటు నందించారు, రికార్డు స్థాయిలో సభ్యులు ప్రశ్నలు అడిగేందుకు, చర్చల్లో పాల్గొనేందుకు, సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యేందుకు ఆయన ప్రోత్సాహాన్ని అందించారు. రాజ్యాంగం గుర్తించిన 22 మాతృభాషల్లో రాజ్యసభ సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. 2018 వర్షాకాల సమావేశాల నుంచి రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో పేర్కొన్న 22 భాషల్లో మాట్లాడేందుకు వీలు కల్పించడమే కాదు, అందుకు తగ్గ అనువాద వ్యవస్థను కూడా పటిష్టం చేశారు, డోగ్రీ, కశ్మీరీ, కొంకణి, సంతాలీ, సింధీ భాషల్లో కూడా సభ్యులు మాట్లాడేందుకు వీలు కల్పించారు, సభ్యులు స్వేచ్ఛగా, సహజంగా వారి భావాలను వ్యక్తీకరించేందుకు మాతృభాషలోనే ఎక్కువ సౌలభ్యంగా ఉంటుందన్న విషయం ఆయన ఆచరణలో నిరూపించి, అందరిలో ప్రేరణ నింపారు.

## కృషి, పట్టుదలతోనే ఉన్నత స్థాయికి...

నిరంతరం అధ్యయనం, నిర్విరామ కృషి వల్లనే వెంకయ్య ఈనాడు ఈ స్థాయికి వచ్చారు, దేనిమీదనైనా పట్టు సంపాదించడం అనేది పుట్టుకతోనో, పదవితోనో రాదు. పరిశ్రమతో వస్తుంది. అధ్యయనం వల్ల వస్తుంది. విద్యార్థి జీవితంలోనూ, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చుట్టూ ఉన్న మహామహులు ఎలా ప్రసంగించేవారో, ఏం ప్రసంగించేవారో వెంకయ్య గమనించేవారు, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సమయం చిక్కినప్పుడల్లా శాసనసభ గ్రంథాలయంలో కూర్చుని తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, అన్నదాత మాధవరావు, తరిమెల నాగిరెడ్డి, జూపూడి యజ్ఞ నారాయణ లాంటి వారు ఏం మాట్లాడారో, ఎలా మాట్లాడారో తెలుసుకునేవారు. ఇప్పటికీ ఆయన రోజూ 30కిపైగా వార్తా పత్రికలు చదువుతారు, విషయం మీద క్షుణ్ణంగా కసరత్తు చేస్తే కానీ దేని గురించి మాట్లాడరు. అంతేకాదు, నిత్యం ప్రజల మధ్య ఉండడం ఆయన తత్వం, పార్టీ పదవిలో ఉన్నా, మంత్రిపదవిలో ఉన్నా, ఉపరాష్ట్రపతిగా ఉన్నా ఆయన ప్రజల మధ్యే ఉండడానికి ఇష్టపడతారు, దేశంలో ఆయన కాలు మోపని ప్రాంతం లేదు. పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్నప్పుడే దేశంలో అన్ని రాష్ట్రాలు, అధ్యక్షుడు అయ్యాక అన్ని జిల్లాలు తిరిగిన ఆయన, ఉపరాష్ట్రపతిగా రాజ్యాంగపరమైన ప్రతిబంధకాలను (ప్రోటోకాల్) పాటిస్తూనే వాటిని తనకు అనువైన విధంగా సడలించుకుని ప్రజల్లో కలిసిపోతూ తమ ప్రత్యేకతను చాటారు. వెంకయ్య తన వాక్ప్రవాహంలో మనం కొట్టుకు పోయేలా మాత్రమే కాదు, తీవ్రంగా ఆలోచింపచేసేలా కూడా చేస్తారు. ముఖ్యంగా ప్రజాస్వామ్య విలువలు, సుపరిపాలన, భారతదేశం తన సంస్కృతి పూర్వవైభవాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం, మరోసారి ప్రపంచానికి మన దేశం దిక్సూచిగా నిలుస్తున్న తీరు గురించి మాట్లాడుతున్నప్పుడు ఆయన మనల్ని అప్రతిభుల్ని చేస్తారు. భారత మహోజ్జ్వల నాగరికత, మహోన్నత వారసత్వ సంపద గురించి ఆయన మాట్లాడకుండా ఉండలేరు. తమ పూర్వీకులు మనకు వారసత్వంగా ఏమి అందించారో అర్థం చేసుకోవల్సిందిగా ఆయన యువతను ప్రేరేపిస్తారు. బహిరంగ సభల్లో ఆయన మౌలిక సిద్ధాంతాన్ని రంగరించి జనరంజకంగా



మాట్లాడతారు. చాలా సాధారణంగా అర్థమయ్యే భాషలో ముఖ్యమైన విషయాలను చెబుతారు.

తాను మాట్లాడే సభల్లో శ్రోతలకు ఏది ఆసక్తిగా ఉంటుందో ఆ అంశాన్నే ఎంచుకుంటారు. తన సిబ్బందికి తాను మాట్లాడదలుచుకున్న కీలకాంశాలను చెప్పి వాటి ద్వారా పరిశోధన చేయించి ఒక సమగ్ర ప్రసంగాన్ని సిద్ధంగా ఉంచుకుంటారు. అంత మాత్రాన ఆయన ఆ ప్రసంగాన్ని యథాతథంగా చదువుతారని అనుకోవడానికి వీల్లేదు. ప్రసంగం చేతుల్లోనే ఉండగానే చాలా సందర్భాల్లో దాన్ని ప్రక్కనపడేసి తన సహజధోరణిలో వాక్పటిమను ప్రదర్శిస్తారు. ఉన్నట్లుండి వాగ్దేవి తాండవిస్తున్నట్లుగా వెంకయ్య తన నిజరూపాన్ని వాగ్ధాటిలో ప్రదర్శించడంతో శ్రోతలు మంత్రముగ్ధులై వినడం చాలాసార్లు గమనిస్తాం. ఉదాహరణకు 2015 జులైలో తానా సభల్లో మాట్లాడుతూ.. 'నమస్కారం మన సంస్కారం.. మీరు మీ రొట్టె తిన్నట్లయితే అది ప్రకృతి. ఇతరుల రొట్టె లాక్కొని తింటే అది వికృతి. మీ రొట్టెను ఇతరులతో కలిసి పంచుకుని తింటే అది సంస్కృతి' అన్నారు. ఆయన తన ఆలోచనలను సమకాలీనం చేయడంలో దిట్ట. మీరు కష్టపడి పనిచేయాలి అని చెబుతూ, 'మీరు చరిత్ర పేజీల్లో ప్రవేశించేందుకు ప్రయత్నించాలి. ఫేస్‌బుక్‌లో ప్రవేశించేందుకు కాదు.' అని చమత్కరించారు.

## తెలుగుజాతికే గర్వకారణం

ఎక్కడో దక్షిణాదిన మారుమూల గ్రామంలో ఉన్న వ్యక్తి దేశ రాజధానిలో నిలదొక్కుకోవడం, భారతదేశంలో ప్రభావ శీలురైన నాయకుల్లో ఒకరుగా గుర్తింపు పొందడం భారత దేశ ప్రజాస్వామ్యం సాధించిన గొప్ప విజయం అని చెప్పక తప్పదు. అందుకే భారత 13వ ఉప రాష్ట్రపతిగా పదవిని అలంకరించిన ఆయన, ప్రజల ఉప రాష్ట్రపతిగా పేరు సంపాదించుకున్నారు. ఇదంతా నా గొప్పతనం కాదు, భారత ప్రజాస్వామ్య గొప్పతనం అని చెప్పగలిగిన నిరాడంబరత ఆయనకు మాత్రమే సొంతం. అందుకే ఆయన అందరివాడు అయ్యారు. తెలుగు వారంతా మా వాడని గర్వంగా చెప్పుకునే నాయకుడయ్యారు. భావితరాలకు స్ఫూర్తిని పంచుతున్నారు.

***"గడచిన 5 దశాబ్దాలకు పైగా తిరిగి తిరిగి అలసిపోయాను. మా ఇంటికే నేను అతిథినైపోయాను. నా వాళ్లకు దగ్గర కావాలనుకుంటున్నాను. నా ఆప్తులు, ఆత్మీయులు, ఆత్మబంధువులు, హితులు, సన్నిహితులతో గడపాలనుకుంటున్నాను. తరచూ మా ఊరికి వెళ్ళి పల్లె గాలి పీల్చి, ఆ వాసన ఆస్వాదించాలనుకుంటున్నాను."***

ఇవీ పలు సందర్భాలలో వెంకయ్య అన్న మాటలు. ఇక ఆయన కోరిక తీరనుంది. ఇన్నాళ్ళు తనవాళ్ళ గుండెల్లో కొలువైన వెంకయ్య, ఇప్పుడు వాళ్ళ లోగిళ్ళలోకి రానున్నారు.

ఆయన అనుయాయులలో, అభిమానులలో తమ పెద్దాయన మరికొంత కాలం రాజ్యాంగ సేవలో ఉండి ఉంటే బాగుండేదన్న కోరిక ఒకవైపు ఉన్నా, ఆయన ఇక తమ మధ్యలోనే ఉండబోతున్నారన్న ఆనందం వారిలో మరోవైపు కనిపిస్తోంది. అంతేకాదు... కొంతకాలం విరామం, విశ్రాంతి తరువాత 2027లో తమ పెద్దాయన భారత రాష్ట్రపతిగా సేవలందిస్తారన్న ఆశాభావం కూడా వారిలో వ్యక్తమవుతోంది. "ఇంతై అంతై.. వటుడింతై" అన్నట్లుగా ఎదిగిన మన వెంకయ్య పుణ్యజీవి, ధన్యజీవి.

## మాతృమూర్తి, మాతృభూమి, మాతృభాష... అంటే ప్రాణం

అమెరికాలో ఉన్న తెలుగువారికి ఆయన అక్కడి చట్టాలను పాటించాలని చెబుతారు. 'మీరు అమెరికాలో ఉన్నప్పుడు అమెరికన్ నిబంధనలను పాటించండి. కాని మీ మూలాలను, సంస్కృతిని ఎన్నడూ మరిచిపోకండి. మమ్మీ–డాడీ సంస్కృతిని అనుసరించకండి. అమ్మానాన్న సంస్కృతికి తిరిగిరండి. నా కూతురు స్వర్ణభారత్ ట్రస్ట్ క్రింద నెల్లూరులో ఒక స్కూలు నడుపుతున్నది. మీడియం ఆంగ్లమైనా సంస్కృతి భారతీయమే అన్నది దాని నినాదం.' అని ప్రకటించారు. ప్రవాసాంధ్రులెప్పుడూ తమ జన్మభూమిని గుర్తుంచుకోవాలని ఆయన పిలుపు నిస్తారు. 'జన్మభూమి, కన్నతల్లి, మాతృభూమి, మాతృభాషను మరిచిపోయిన వాడు మానవుడే కాదు..'అని ఆయన వ్యాఖ్యానించారు. మీరు విదేశాలకు వెళ్లి నేర్చుకోండి, సంపాదించండి, దేశానికి తిరిగి ఇవ్వండి(లెర్న్, ఎర్న్ అండ్ రిటర్న్) అని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు,

ప్రజా ప్రతినిధులు చేస్తే టాక్ అవుట్ చేయాలి. లేదా వాకౌట్‌లు చేయాలి. బ్రేక్ అవుట్ మాత్రం చేయకూడదు. అంటే సభను భగ్నం చేయకూడదు అని ఆయన రాజ్యసభ ఛైర్మన్‌గా సభ్యులకు ఉద్బోధిస్తారు. వివిధ సందర్భాల్లో లింగ సమానత్వం గురించి ఆయన మాట్లాడే ఒక్కో మాట ప్రతి మనసును కదిలిస్తుంది. భారత నాగరికతా ప్రస్థానంలో, హిందూ గ్రంథాల్లో స్త్రీలకున్న ఉన్నత పాత్రను తరచూ ఆయన ప్రస్తావిస్తారు. 2015 ఫిబ్రవరిలో లింగ సమస్య, పట్టణ పేదరికం అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తూ వెంకయ్యనాయుడు 'యత్ర నార్యస్తు పూజ్యంతే– రమంతే తత్ర దేవతాః (ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు)' అన్న సంస్కృత శ్లోకాన్ని ఉటంకించారు. మన పురాణాల్లో సరస్వతీ దేవి విద్యకు అధినేత్రిగా, లక్ష్మీదేవి సంపదకు అధినేత్రిగా, దుర్గాదేవి రక్షణకు అధినేత్రిగా ఎలా స్తుతించబడ్డారో ఆయన వివరిస్తారు. అదే విధంగా స్మృతీ ఇరానీ, నిర్మలాసీతారామన్, నజ్మా హెప్తుల్లా తదితరులు ప్రభుత్వంలో ఎలా ఉన్నత స్థానాలను అధిష్టించారో ఆయన వివరించి చెప్పారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com